
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
సోమవారం 19 మే 2025 | 3



రాజమహేంద్రవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం: 38.0 (ఆదివారం)
కనిష్ఠం: 27.0



ల్యాబ్‌ల.. చీటింగ్!



రాజమహేంద్రవరానికి చెందిన ధీరజ్‌కు జ్వరం రావడంతో ఒక ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లాడు.. డాక్టర్ ఏమిటి సమస్య అని అడిగి సుమారు 10కి పైనే టెస్టులు రాశాడు.. అది చూసి ధీరజ్ ఆశ్చర్యపోయాడు.. ఇవన్నీ చేయించాలా సార్ అని అడిగాడు.. అందుకే రాసిచ్చింది అంటూ డాక్టర్ సీరియస్ అయ్యాడు.. ధీరజ్ టెస్టులన్నీ చేయించుకున్నాడు. అంతా బాగానే ఉందని రిపోర్టు వచ్చింది.. ఆ రిపోర్టు చూసి డాక్టర్ బాగానే ఉందని చెప్పి పంపించాడు.. దీనికి ఖర్చెంతయ్యిందో తెలుసా.. అక్షరాలా రూ.5 వేలు.. గతంలో అయితే నాడి పట్టుకుని చూసి రోగం ఏంటో చెప్పేవారు.. మరి నేడు వైద్య వృత్తి వ్యాపారంగా మారిపోయింది. టెస్ట్ చేయించనిదే రోగమేంటో చెప్పలేని దుస్థితిలో వైద్యులు తయారయ్యారు.. ఎందుకంటే వైద్యులకు డబ్బు జబ్బు పట్టుకుంది. ల్యాబ్‌కు ఒక టెస్ట్ రాస్తే.. ఫీజు రూ.100 అనుకుంటే.. డాక్టర్‌కు రూ.60.. ల్యాబ్‌కు రూ.40.. దీంతో ల్యాబ్‌లు ఇబ్బడిముబ్బడిగా పుట్టుకొస్తున్నాయి.

ఒక మహిళకు సైనసైటిస్ ఉందని వైద్యుడు సీటీ స్కానింగ్ రాశారు. ఆ సీటీ స్కానింగ్ చేయించుకొని ఆ వైద్యుడి వద్దకు వెళితే మందులిచ్చారు. కానీ తగ్గుము ఖం పట్టలేదు. దీంతో ఆమె మరో వైద్యుడి వద్దకు వెళ్లారు. అక్కడ స్కానింగ్ ఫిల్మ్ చూసిన డాక్టర్.. అసలు వ్యాధి సైనసైటిస్ కాదని అనుమానించి మరో సారి స్కానింగ్ రాశారు. దీనిని మరో ల్యాబ్‌లో చేయించు కోగా కణితి ఉందని రిపోర్టులో రాశారు. బయాప్సీ చేయగా నాసో ఫరింజల్ కార్సినోమా(క్యాన్సర్) అని తేలింది. ముందు స్కానింగ్‌కీ, రెండో స్కానింగ్‌కీ మధ్య నెల గడిచిపోయింది. దీంతో క్యాన్సర్ రెండో స్టేజికి వెళ్లిపోయింది. అదే ముందు స్కానింగ్ రిపోర్టులోనే గుర్తించి ఉంటే.. మరి దీనికి బాధ్యులు ఎవరు?.. ఈ ఒక్క ఉదాహరణ చాలు.. ప్రైవేటు ల్యాబ్‌లు ప్రజల ప్రాణాలతో ఎలా ఆడుకుంటున్నాయో తెలియడానికి!

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఒకనాడు ల్యాబ్‌లో పరీక్ష చేయించాలంటే రోగులకు అనవసరపు ఖర్చు ఎందుకా అని వైద్యులు ఆలోచించేవారు.. నేడు కోట్లు ఖర్చు పెట్టి చదువుతున్నారు..ఆ జాలి లేదు. దయ లేదు..ఎంత వస్తే అంత రానీ అంతే. ప్రస్తుతం ఎలా ఉందంటే జ్వరం వచ్చిందా?.. టెస్టులు చేయించేయండి. తలపోటా? ఎందుకైనా మంచిది సీటీ స్కాన్ చేయించేద్దాం. ఇలా రోగుల భయాన్నే పెట్టుబడిగా పెట్టి మెడికల్ ల్యాబ్‌లు దందా సాగిస్తున్నాయి. దీంతో ప్రైవేటు ల్యాబ్‌ల వ్యాపారం జోరుగా సాగుతోంది. ఉదాహరణకు షుగర్(మధుమేహం) టెస్టు చేయాలంటే ల్యాబ్‌లకు రూ.20 ఖర్చవుతుంది. కానీ రూ.150 వరకూ లాగేస్తున్నారు. ఇదిలా ఉంటే.. చట్ట వ్యతిరేకంగా గర్భస్థ శిశు నిర్ధారణ జరుగుతోందనే ఆరోపణలున్నాయి.. అధికారులు మాత్రం మామూళ్లు చేజారిపోతాయనే భయంతో తనిఖీలకు జంకుతున్నారు. కొన్ని ల్యాబ్‌లలో అనధికారికంగా లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్టు సమాచారం.

జిల్లాలో 350 ల్యాబ్‌లు..

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో చిన్న, పెద్ద ల్యాబ్‌లు 350 వరకూ ఉన్నాయి. ఇవి రిజస్ట్రేషన్ అయినవి..ఏ అనుమతులూ లేకుండా నడుస్తున్నవి మరో అన్ని ఉంటాయి. దాదాపుగా అన్ని ల్యాబ్‌ల వాళ్లకూ డాక్టర్లతో కనెక్షన్ ఉంటోంది. దీంతో అవసరం లేకపోయినా వైద్య పరీక్షలు రాస్తున్నారు. ల్యాబ్ పేరుతో ఉన్న చీటీపైనే వైద్యుడు ఏమి పరీక్షలు కావాలో రాస్తాడు. దీంతో అదే ల్యాబ్‌కి వెళ్లాల్సి వస్తోంది. అక్కడి ఎంత మొత్తం అడిగితే అంతా జమ చేయాల్సిందే. ఒక వైద్యుడు రాయగా టెస్టులు చేయించుకొని.. ఆ రిపోర్టులను మరో వైద్యుడికి చూపిస్తే.. అబ్బే అవి పని చేయవంటూ మళ్లీ మొదటి నుంచీ అన్ని టెస్టులూ రాస్తున్నారు.దీంతో మళ్లీ వైద్య పరీక్షలు చేయించుకోవాల్సి వస్తోంది. సాధారణ జలుబుకు సైతం చాంతాడంత వైద్య పరీక్షల జాబితా ఇస్తున్నారు.ఎందుకంటే ల్యాబ్‌లు వసూలు చేసే సొమ్ముల్లో గరిష్ఠంగా 60 శాతం వరకూ వైద్యుల కమిషన్ ఉం టోందని చెబుతున్నారు.ఆర్ఎంపీ తీసుకెళితే 30 శాతం వరకూ ముడుతోందట. కార్పొరేట్ ఆస్పత్రుల్లో డాక్టర్లకు టార్గెట్‌లు విధించడంతో విధిలేని పరిస్థితుల్లో కొందరు వైద్యులు ఎడా పెడా వైద్య పరీక్షలు రాస్తున్నారని చెబుతున్నారు.

డాక్టర్ల చీటీతో..ల్యాబ్‌ల దోపిడీ

- జ్వరమని వెళ్లినా పరీక్షే
- నాడి పట్టుకోకుండానే చీటి
- టెస్ట్ రిపోర్టు వస్తేనే వైద్యం
- రోగుల జేబులు ఖాళీ
- ఉమ్మడి జిల్లాలో 350 ల్యాబ్‌లు
- అనుమతిలేనివి డబుల్
- వైద్యాధికారులకు మామూళ్లు
- ఎక్కడా కానరాని ధరల పట్టికలు
- తనిఖీలు చేయని వైనం

కానరాని ఫీజు బోర్డులు..

మెడికల్ ల్యాబొరేటరీల్లో ఆయా వైద్య పరీక్షలకు సంబంధించి ధరల పట్టికలు ఉండాలి. కానీ అధిక శాతం ల్యాబ్‌లలో అవి కానరావు. ఒకవేళ పెడుతున్నా అవి ఎక్కడ ఉన్నాయో వెతుక్కోవాల్సిందే.. లేదంటే చాలా చిన్న అక్షరాలతో ఉంటున్నాయి. రోగులు ధరలపై ప్రశ్నించే అవకాశమే ఉండదు. ఇదే అదునుగా ఇష్టానుసారం ధరలను పిండేస్తున్నారు. ఒకే రకం టెస్టుకు ఒక ల్యాబ్‌కి మరో ల్యాబ్‌కి సంబంధం ఉండడం లేదు. తూర్పుగోదావరిలో 107, కాకినాడ జిల్లాలో 115, కోనసీమ జిల్లాలో మరో వంద వరకూ ల్యాబ్‌లకు ప్రభుత్వ అనుమ తులున్నాయి. అనుమతులు లేనిల్యాబ్‌లు మరో అన్ని ఉంటాయి. దాదాపు అన్ని ల్యాబ్‌లలోనూ ధరల దందా కొనసాగుతూనే ఉంది. ఉదాహరణకు క్యాన్సర్ నిర్ధారణకు తప్పని సరిగా చేసే పెట్ స్కానింగ్‌కి రూ.25 వేల వరకూ వసూలు చేస్తున్నారు. ఇదే స్కానింగ్‌ని తక్కువ ధరకూ చేసే వీలుందని చెబుతున్నారు. ల్యాబ్‌లు ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోవడంతో పెద్ద ల్యాబ్‌లు ఎన్నో రకాల రాయితీలను ప్రకటిస్తున్నాయి. 10 శాతం నుంచి ఏకంగా 70 శాతం వరకూ రాయితీలను ప్రకటిస్తున్నాయంటే ఏ స్థాయిలో దోపిడీ జరుగు తుందో అర్థం చేసుకోవచ్చు. వైద్యులు వ్యాధి నిర్ధారణకు ల్యాబ్‌ల టెస్టులపైనే ఎందుకు పూర్తిగా ఆధారపడిపోతున్నారో అనే ప్రశ్నలకు సహేతుకమైన జవాబు శూన్యమే.



అధికారులకు మామూళ్లు..

ల్యాబ్‌లను నియంత్రించే అధికారం ఉన్న అధికారులు 'ఎందుకనో' తనిఖీల ఊసెత్తడం లేదు. సాధారణంగా ల్యాబ్‌లు ఐదేళ్లకు ఒకసారి లైసెన్సు రెన్యువల్ చేయించుకోవాలి. లైసెన్సు రెన్యువల్‌కి దరఖాస్తు సదరు అధికారి టేబు ల్‌పైకి వెళ్లినప్పుడు మాత్రమే తనిఖీ కాదు..పరిశీలన చేస్తున్నారు. అది కూడా తూతూ మంత్రంగానే జరుగుతోందనే ఆరోపణలు ఉన్నాయి.లైసెన్సు ఇచ్చిన తర్వాత ఐదేళ్ల పాటు ఆ ల్యాబ్ దరిదాపుల్లోకి అధికారులు వెళ్లకపోవడంతో చాలా ల్యాబ్‌లలో సదుపాయాలు,అవసరమైన యంత్ర పరికరాలు ఉండక పోయినా నడిపించేస్తున్నారు. అసలు ల్యాబ్‌లో అందుబాటులో లేని వైద్య పరీక్షలు బోర్డుల్లో దర్శనమిస్తుంటాయి. రోగి వెళ్లిన తర్వాత ఆ వైద్య పరీక్షలకు నమూనాను హైదరాబాద్, పుణె, ఢిల్లీ పంపిం చాలంటూ డబ్బులు వసూలు చేస్తున్నారు. కానీ చాలా మటుకు ఊళ్లోనే చక్కబెడుతున్నారు.

వర్రీ తీర్చేనా!

- మరో 40 వేల టన్నులు కొంటే సరి
- ధాన్యం రైతు గట్టెక్కినట్టే
- 3.4 లక్షల టన్నులు టార్గెట్
- 3.25 లక్షల టన్నులు కొనుగోలు
- ఆంధ్రజ్యోతి కథనంతో కదలిక

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఆరుగాలం పండించిన పంటను అమ్ముకోవడానికి అన్నదాత అవస్థలు పడుతున్నాడు. ఒక పక్క ప్రభుత్వం, మంత్రులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామంటూ ప్రకటనలు చేస్తున్నారు.అది క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. అధికార యంత్రాంగం గతం కంటే ఎక్కువే కొన్నాం.. టార్గెట్లు పూర్తయ్యాయంటూ కొనుగోళ్లను నిలుపుదల చేయడంతో రైతులు రోడ్డెక్కి ఆందోళన చేస్తున్నారు.జిల్లాలో మరో 40 వేల టన్నుల ధాన్యం సేకరిస్తే రబీ రైతాంగం గట్టెక్కుతుంది.అంతర్జాతీయ బియ్యం మార్కెట్ పడిపోవడంతో కాకినాడ పోర్టు నుంచి బియ్యం ఎగుమతులు లేకపోవడంతో జిల్లాలో మిల్లర్లు ధాన్యం కొను గోళ్ల ఆపేశారు. ఈ నేపథ్యంలో రైతాంగం అంతా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలవైపు చూసిన సంగతి తెలిసిందే.దీంతో ధాన్యం సేకరణ సమస్య మొదలైంది.జిల్లాలో సుమారు 4.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి కాగా మొదట్లో ప్రభుత్వం పౌరసరఫరాల సంస్థ ద్వారా 2.5 లక్షల టన్నుల ధాన్యం సేక రణ లక్ష్యంగా పెట్టుకుంది. మండలాలవారీ లక్ష్యాలు నిర్ణయించి కొనుగోలు చేసింది. కానీ మొదట్లోనే టార్గెట్లు పూర్తి కావడం, అప్పటికి ఇంకా కోతలు పూర్తి కాకపోవడంతో రైతుల ధాన్యం కొనేవాడు కరువయ్యారు.ఈ నేపథ్యంలో రైతుల ఇబ్బందులను పసిగట్టిన ఆంధ్ర జ్యోతి వారి పరిస్థితిని వెలుగులోకి తెచ్చింది. దీంతో జిల్లా యంత్రాంగం, మంత్రులు , ఎమ్మె ల్యేలు స్పందించారు. మరో 90 వేల టన్నుల లక్ష్యం పెంచడంతో రైతులు కుదుట పడ్డారు. అయితే ప్రస్తుతం మరో 40 వేల టన్నుల నుంచి 50 వేల టన్నుల ధాన్యం రైతుల వద్ద ఉండిపోయినట్టు చెబుతున్నారు. కొవ్వూరు డివిజన్‌లో ఎక్కువగా ఉంది. రాజమహేంద్ర వరం డివిజన్‌లో కేవలం అనపర్తి నియోజక వర్గంలో మాత్రమే కొంత మేర ఉన్నట్టు రైతు లు చెబుతున్నారు. బొండాల ధాన్యం కూడా ఉంది. గతంలో మిల్లర్లు ఎక్కువగా బొండాల రకం కేరళకు తోలేవారు. కానీ కేరళలో కూడా ప్రస్తుతం డిమాండ్ లేకపోవడంతో కొన్ని మిల్లులు తాత్కాలికంగా మూతపడడం గమ నార్హం. ప్రస్తుతం ప్రభుత్వం జిల్లాలో 20 వేల టన్నుల బొండాల ధాన్యం సీఎంఆర్ కింద సేకరించింది. మరో 20 వేల టన్నులు సేకరిస్తే మొత్తం సమస్య పరిష్కారమవుతుందని రైతులు,మిల్లర్లు చెబుతున్నారు. జిల్లాలో ఇప్పటి వరకూ 27,949 మంది రైతుల నుంచి 3,24, 319.480 టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. దీని విలువ రూ. 746.62 కోట్లు. ఇంతవరకూ రైతుల ఖాతాల్లో రూ.603.62 కోట్లు జమచేశారు. మరో రూ.142.95 కోట్లు జమచేయడానికి సిద్ధం చేస్తున్నారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్ వచ్చేస్తుంది. జూన్ నెల నుంచే రైతాంగం ఏరువాకకు సిద్ధం కావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగం రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేస్తే, రైతులు సంతోషంతో ఖరీఫ్‌కు సన్నద్ధమవుతారు.

పంట వెళ్లినా..ఆన్‌లైన్ చేయలేదు..



ఆరుగాలం పండించిన పంటను అమ్ముకోవడానికి అవస్థలు పడుతున్నాం. చాగల్లు మండలంలో 100 ఎకరాలు వరిసాగు చేశా. అకాల వర్షాల కారణంగా 8 వేల సొరలు మిల్లులకు తరలించి 20 రోజులవు తుంది. ఇంకా ఆన్‌లైన్ చేయలేదు. అధికారుల చుట్టూ తిరుగుతున్నాం. టార్గెట్ ఈ రోజు వస్తుంది. రేపు వస్తుంది అంటున్నారు.

- నామాల నరేంద్ర, రైతు,మల్లవరం

పంట కొనడం లేదు..



చాగల్లు మండలం మార్కొండపాడులో 18 ఎకరాలు సాగుచేశా. పంట అమ్ముదామంటే ఆర్ఎస్‌కెలో టార్గెట్ అయిపోయిందని చెబుతున్నారు. వర్షాలు పడుతున్నందున మిల్లరు సహకారంతో ధాన్యాన్ని మిల్లుకు తరలించా. జేసీ,ఆర్డీవో కార్యాలయాల చుట్టూ తిరిగిన ప్రయోజనం లేదు. ప్రభుత్వం స్పందించి ధాన్యాన్ని కొనుగోలు చేయాలి.

- కె.సుబ్రహ్మణ్య రమేష్, మార్కొండపాడు

22 పంచాయతీలకు స్పెషల్ గ్రేడ్

అధికారుల ప్రతిపాదనలు

రాజమహేంద్రవరం రూరల్ మే 18 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల ఆదాయం, జనాభా ప్రాతిపదికన స్పెషల్ గ్రేడ్, గ్రేడ్-1, గ్రేడ్-2, గ్రేడ్-3 పంచాయతీలుగా మార్చనున్నారు. 10వేల పైబడి జనాభా కలిగి..రూ.కోటి వార్షికాదాయం చేకూరే పంచాయతీలను స్పెషల్ గ్రేడ్ పంచాయతీలుగా, 4 వేల నుంచి 10వేల మధ్య జనాభా కలిగి, రూ.50 లక్షల నుంచి రూ.కోటి మధ్య వార్షికాదాయం కలిగిన పంచాయతీలను గ్రేడ్-1 పంచాయతీలుగా, 2 వేల నుంచి 4 వేలు మధ్య జనాభా ఉన్న పంచాయతీలను గ్రేడ్-2 పంచాయతీలుగా, 2 వేల లోపు జనాభా కలిగిన గ్రామాలను గ్రేడ్-3 పంచాయతీలుగా మార్చనున్నారు. ఆయా పంచాయతీలకు గెజిటెడ్ స్థాయి అధికారి బాధ్యతలు అప్పగించనున్నారు. ఇటీవలే ఈవోపీఆర్‌డీలకు డిప్యూటీ ఎంపీడీవోలుగా పదోన్నతులు కల్పించారు. వీరికి ఈ బాధ్యతలు అప్పగించనున్నట్టు సమాచారం. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 63 పంచాయతీలకు స్పెషల్ గ్రేడ్ పంచాయతీలుగా మార్చుతూ ప్రతిపాదనలు పంపించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం, కొవ్వూరు డివిజన్ల పరిధిలో 22 పంచాయతీలను స్పెషల్ గ్రేడ్ పంచాయతీలుగా మారనున్నాయి. రాజమహేంద్రవరం డివిజన్‌లో 14 గ్రామాలు, అనపర్తి, బిక్కవోలు, గోకవరం, కడియం, కడియపులంక, బొమ్మూరు, ధవళేశ్వరం, హుకుంపేట, కాతేరు, పిడింగొయ్యి, శాటిలైట్‌సిటీ, కోలమూరు,దివాన్ చెరువు గ్రామాలు ఉన్నాయి. కొవ్వూరు డివిజన్ పరిధిలో 8 గ్రామాలు ఉన్నాయి. చాగల్లు,దేవరపల్లి, గోపాలపురం, పోతవరం, ఖండవల్లి,ఉండ్రాజవరం, వేలివెన్ను, పంగిడి గ్రామాలు ఉన్నాయి. రూరల్ మండలం పరిధి వెంకటనగరం, తొర్రేడు గ్రామాల్లో నిబద్ధతతో పన్నులు వసూలు చేస్తే ఎక్కువ మొత్తంలో ఆదాయం చేకూరుతుందని,స్పెషల్ గ్రేడ్ పంచాయతీలుగా మారే అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.



కోడి..ఓడి!

- పౌల్ట్రీ పరిశ్రమకు మళ్లీ నష్టాలు
- అప్పుడే ఎండ.. వెంటనే వాన
- తట్టుకోలేక చనిపోతున్న కోళ్లు
- పెరుగుతున్న మోర్టాలిటీ
- పడిపోయిన గుడ్డు దిగుమతులు
- లబోదిబోమంటున్న రైతాంగం

విభిన్న వాతావరణంతో విలవిల



అనపర్తి, మే 18 (ఆంధ్రజ్యోతి) : వాతావరణంలో వచ్చిన మార్పులు పౌల్ట్రీ రంగంపై పెనుమార్పులు చూపెడుతున్నాయి. ప్రస్తుతం పౌల్ట్రీ పరిశ్రమ నష్టాల్లో ఉంది. రెండు నెలల కిందట వచ్చిన బర్డ్‌ఫ్లూతో తీవ్ర నష్టాల్లో కూరుకుపోయారు. వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా మరింత నష్టాల పాలవుతున్నారు. ఎండల తీవ్రతకు కోళ్లు పిటల్లా రాలిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 1.50 కోట్ల కోళ్లు ఉండగా వీటి ద్వారా రోజుకు సుమారు 1 కోటి వరకు గుడ్లు దిగుమతి అవుతాయి. ఎండల తీవ్రతకు సుమారుగా 12 నుంచి 15 శాతం వరకు గుడ్లు దిగుమతి పడిపోగా రోజుకు సుమారుగా 30 వేల కోళ్ల వరకు భానుడి భగభగలకు నేలవాలుతున్నట్టు సమాచారం. ఈ ఏడాది వాతావరణంలో భిన్న పరిస్థితులు ఉన్నాయి. ఉదయం ఎండ మధ్యాహ్నం చిరు జల్లులు పడడంతో అధిక సంఖ్యలో కోళ్ల మృత్యువాత పడుతున్నాయని రైతులు చెబుతున్నారు. ఎండ తీవ్రత ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒకే విధంగా ఉంటే పెద్ద నష్టం జరిగేది కాదని విభిన్న వాతావరణం ఉండడంతో కోళ్ల తట్టుకోలేక పోతున్నాయని వారంటున్నారు. కోళ్లను ఎండ తీవ్రత నుంచి కాపాడుకునేందుకు ప్రతి షెడ్డుపైనా స్ప్రింకర్లు ఏర్పాటు చేశారు. షెడ్లపై నీళ్ల వెదజల్లుతూ వాతావరణ సమతుల్యత ఉండేలా చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే గుడ్లు ఉత్పత్తి తగ్గడం అనుకున్న రీతిలో ఎగుమతులు లేకపోవడంతో రైతులకు దినదిన గండంగా మారింది. రెండు రోజులు పేపర్ ధరకు కట్టుబడి జరగడం, మరో రెండు రోజులు కమింగ్ ధరతో సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని వాపోతున్నారు. ప్రస్తుతం గుడ్డు ధర రూ.5.15 పైసలు ఉన్నప్పటికీ కమింగ్ రేటుతో తక్కువ ధరకు ట్రేడర్లకు విక్రయించాల్సి వస్తుందని.. గుడ్డు దిగుబడి తగ్గిపోవడంతో మరింత నష్టం చవిచూడాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాణా రేట్లు మందుల రేట్లు, లేబర్ చార్జీలు, విద్యుత్ బిల్లులతో రైతులు సతమతమవుతున్నారని పలువురు పరిశ్రమ పెద్దలు అంటున్నారు.సీఎం నారా చంద్రబాబు నాయుడు పౌల్ట్రీ పరిశ్రమ ఎదుర్కొంటున్న కష్ట నష్టాలపై దృష్టి సారించాలని త్వరలోనే కోళ్ల రైతులకు కొన్ని రాయితీలు అందించి పరిశ్రమను ఆదుకుంటారన్న నమ్మకంతో ఉన్నామని పలువురు రైతులు అంటున్నారు. మరో నెల రోజుల పాటు విభిన్న వాతావరణం సాగితే మరింత నష్టం జరుగుతుందని రైతులంటున్నారు.

ఆలయ భూముల వేలం ఎప్పుడో!

వేణుగోపాలుడికి తొర్రేడులో 23.58 ఎకరాలు

రాజమహేంద్రవరం రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి) : దేవుడి భూములకు ఎసరు పెడుతున్నారు.. తక్కువ మొత్తంతో పాడుకునేలా చేసి దేవుడికే శఠగోపం పెట్టేలా చేస్తున్నారు.ఈ సంఘటనే అందుకు ఉదాహరణ. రాజమహేంద్రవరం రూరల్ మండలం తొర్రేడులో ఉన్న శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానం భూములకు గత నెల 25వ తేదీన జరగాల్సిన భూమి కౌలు హక్కు వేలం కొన్ని అనివార్య కారణాల వల్ల రద్దయింది. అయితే వేలం మళ్లీ ఎప్పుడు చేపడతారనేది ప్రశ్నార్థకంగా ఉంది. ఈ ఆలయానికి తొర్రేడులో 23.58 ఎకరాల భూమి ఉంది. దేవాదాయ శాఖ విధించిన నిబంధనల ప్రకారం వేలంలో పాల్గొనేవారు 5 లక్షల సాల్వెన్సీ సర్టిఫికెట్, రూ.20 వేలు దరావత్తు సొమ్ము చెల్లించాలి. సుమారు 15 మంది వరకూ వేలంలో పాల్గొనేందుకు సిద్ధం అయ్యారు. అయినా వేలం నిలుపుదల చేశారు. పాటదారులు వచ్చినా నిలుపుదల చేయడంపై రకరకాల విమర్శలు వినిపిస్తున్నాయి. గుట్టుచప్పుడు కాకుండా ఎంతో కొంత పెచ్చు ధర పెట్టి గతంలో పాడిన వారికే కట్టబెట్టే పనిలో అధికా రులు ఉన్నారంటూ ప్రచారం జరుగుతుంది. ఆరోగ్యం బాగాలేకపోవడంతో వేలం ప్రక్రియ నిలిపివేయాల్సి వచ్చిందని ఈవో సుబ్బారావు తెలిపారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్‌తో మాట్లాడి, ముందుగా గ్రామస్తులకు తెలియపరచి నిబంధనల ప్రకారం మళ్లీ వేలం నిర్వహిస్తామన్నారు.

జయహో.. భారత్



నిడదవోలు, మే 18 (ఆంధ్రజ్యోతి) : దేశభక్తి ఉప్పొంగింది.. భారత్ మాతాకీ జై అంటూ జనం వీధుల్లోకి వచ్చారు.. మువ్వన్నెల జెండా పట్టుకుని వీధివీధినా మేలుకొలిపారు.. రండి మీరూ చేరండి అంటూ పిలవకనే పిలిచారు.. దీంతో నిడదవోలులో తిరంగా యాత్ర ఆదివారం ఘనంగా సాగింది.నిడదవోలు గాంధీబొమ్మ సెంటరు నుంచి వినాయకుడి గుడి మీదుగా ఐ లవ్ నిడదవోలు పార్కు వరకు తిరంగా ర్యాలీ నిర్వహించారు. దీనిలో భాగంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ భారత జాతి వైపు ఎవరైనా కన్నెత్తి చూస్తే వారికి గుణపాఠం చెప్పేందుకు సైనికుల నుంచి మొదలుకొని రైతుల వరకు జాతి యావత్తూ ఒక్కటై వారికి గుణపాఠం చెబుతుందనడానికి నిదర్శనమే ఈ తిరంగా యాత్ర అన్నారు. జనం స్వచ్ఛందంగా రావడం అభినందనీయమన్నారు. ర్యాలీ మన ఐక్యతకు నిదర్శనమన్నారు.స్కిల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ బూరుగు పల్లి శేషారావు మాట్లాడుతూ మనమంతా ఒక్కటే అని.. ఏ సమస్య వచ్చినా ఒక్కటై ఎదుర్కొంటామనడానికి నిదర్శనం ఈ యాత్ర అన్నారు.ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ, టీడీపీ, జనసేన, బీజేపీ, పార్టీల నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది వివిధ వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



సరస్వతి పుష్కరాలకు పోటెత్తిన భక్తులు

» నాలుగవ రోజు 1.30 లక్షల మంది పుణ్య స్నానాలు

భూపాలపల్లి, మే18 (ఆంధ్రజ్యోతి): సరస్వతీ పుష్కరాల సందర్భంగా తెలంగాణలోని కాళేశ్వర క్షేత్రం భక్తులతో కిక్కిరిసింది. పుష్కరాల్లో మొదటి రెండు రోజులు జనం పెద్దగా కనిపించకపోయినా శని, ఆదివారాల్లోనే దాదాపు రెండున్నర లక్షల మంది భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి పుష్కర స్నానాలు ఆచరించారు. ఆదివారం ఒక్కరోజే దాదాపు 1.30 లక్షల మందికి పైగా భక్తులు సరస్వతి పుష్కరాల్లో పుణ్యస్నానాలు చేశారు. ముక్తేశ్వర స్వామిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ పెరగడంతో మహాదేవపూర్ నుంచి కాళేశ్వరం దాకా ట్రాఫిక్ సుమారు 10 గంటల పాటు స్తంభించిపోయింది. దాదాపు 16 కిలోమీటర్ల మేర ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాలు రోడ్డుపైనే నిలిచిపోవడంతో పుష్కరాలకు వచ్చిన భక్తులు నానా ఇబ్బందులు పడ్డారు.

హైదరాబాద్‌లో పేలుళ్లకు కుట్ర!

(మొదటి పేజీ తరువాయి)

సిరాజ్-ఉర్-రెహ్మాన్ అరెస్టయ్యారు. వీరిని రిమాండ్‌కు తరలించారు.

ఏం జరిగింది?: విజయనగరం జిల్లా కేంద్రంలోని అంబటి సత్రానికి చెందిన సిరాజ్-ఉర్-రెహ్మాన్ బీటెక్ పూర్తిచేసి హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసి అక్కడే ఉగ్రవాద కార్యకలాపాలపై ఆసక్తి పెంచుకున్నాడు. ఆ తర్వాత విదేశీ ఉగ్రవాద సంస్థ ఐఎస్‌తో పరిచయం ఏర్పడింది. ఆ సంస్థ సూచనలతో పేలుళ్లతో విధ్వంసం సృష్టించేందుకు కుట్ర పన్నినట్టు నిఘా వర్గాలు గుర్తించాయి. పేలుళ్లకు వినియోగించే అమ్మోనియా, సల్ఫర్, అల్యూమినియం పౌడర్‌లను ఆన్‌లైన్‌లో సంపాదించాడు. దీనిపై ఏపీ, తెలంగాణ కౌంటర్ ఇంటెలిజెన్స్‌కు సమాచారం అందింది. అంతేకాకుండా గతంలో సిరాజ్ సామాజిక మాధ్యమంలో పాకిస్థాన్ అనుకూలంగా పోస్టులు పెట్టినట్టు గుర్తించారు. మరోవైపు, హైదరాబాద్‌కు చెందిన సయ్యాద్ సమీర్‌తో రహ్మాన్‌కు ఇన్‌స్టాలో పరిచయం ఏర్పడింది. ఇద్దరి మధ్య స్నేహం పెరిగింది. సమీర్ కూడా ఉగ్రసానుభూతి పరుడిగా మారినట్టు నిఘా వర్గాలు గుర్తించాయి. దీంతో సమీర్‌ను హైదారాబాద్‌లో అదుపులోకి తీసుకుని విజయనగరం తీసుకొచ్చారు. ఏపీ, తెలంగాణ పోలీసులతో పాటు, జిల్లా పోలీస్ అధికారులు ఇద్దరినీ పూర్తి స్థాయిలో విచారించారు. ఇద్దరిపైనా ఉగ్రవాద సానుభూతి చర్యలు, పేలుళ్లకు కుట్ర, నేరపూరిత కుట్ర తదితర సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి జడ్జి ముందు ప్రవేశ పెట్టారు. న్యాయస్థానం ఆదేశాలతో రిమాండ్‌కు తరలించారు. కాగా.. సిరాజ్ తండ్రి, సోదరుడు ఏపీ పోలీస్ శాఖలో పని చేస్తున్నారు.

యూట్యూబ్‌లో చూసి..: సౌదీ అరేబియాలోని ఐఎస్ ఉగ్రవాదుల(హ్యాండర్లు) నుంచి బాంబుల తయారీకి ఆదేశాలు వచ్చినట్లు ఇరురాష్ట్రాల నిఘావర్గాలు గుర్తించాయి. ఈ క్రమంలో బాంబులు ఎలా తయారు చేయాలనే విషయాన్ని యూట్యూబ్‌లో వెతుకులాడినట్టు అధికారులు గుర్తించారు. అనంతరం, హైదరాబాద్‌లో బాంబులను తయారు చేశారని నిర్ధారించారు. ఈ బాంబులను పరీక్షించేందుకు కొన్ని ప్రదేశాలను వీరు ఎంపిక చేసుకున్నట్లు సమాచారం. ఈ క్రమంలో అసలు హైదరాబాద్‌లో వీరి టార్గెట్ ఏమిటి? ఎక్కడ పేలుళ్లకు కుట్రలు పన్నారు? ప్రత్యక్షంగా.. పరోక్షంగా ఎవరెవరు సహకరిస్తున్నారు? అనే కోణాల్లో వీరిని విచారించనున్నట్లు ఉన్నతాధికారులు తెలిపారు.

గురితప్పిన ఇస్రో బాణం

(మొదటి పేజీ తరువాయి)



ఉపగ్రహాన్ని తీసుకుని భారీ అంచనాలతో నింగిలోకి ఎగిరిన పీఎస్ఎల్వీ-సీ61 సాంకేతిక సమస్య కారణంగా లక్ష్యాన్ని చేరుకోలేకపోయింది. నింగిలోకి దూసుకెళ్లిన కాసేపటికే మూడో దశలో సాంకేతిక సమస్య తలెత్తడంతో రాకెట్ ప్రయాణ గమన దిశ మారింది. సాంకేతిక సమస్యను గుర్తించిన ఇస్రో శాస్త్రవేత్తలు రాకెట్ దిశను మార్చి నిర్దేశిత మార్గంలోకి తీసుకొచ్చేలా చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో ఈ మిషన్‌ను అర్ధంతరంగా ముగించాల్సి వచ్చింది. ప్రామాణిక భద్రత ప్రొటోకాల్‌ను అనుసరించి సాంకేతిక సమస్యను గుర్తించిన తర్వాత రాకెట్‌లోని నాలుగో దశ, పేలోడ్ (ఈవోఎస్-09)లను కూల్చివేశారు. అనంతరం మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ మాట్లాడుతూ.. ప్రయోగం పూర్తి కాలేదని.. రెండు దశలను విజయవంతంగా పూర్తి చేసుకొన్న రాకెట్‌కు మూడో దశలో సాంకేతిక సమస్య వచ్చిందని వెల్లడించారు. దీంతో... సరిహద్దులపై నిఘా కోసం ఈవోఎస్-09 ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టేందుకు భారత్ చేసిన ప్రయత్నం తాత్కాలికంగా నిలిచిపోయింది.

పీఎస్ఎల్వీకి మూడో పరాజయం

అంతకుముందు శనివారం ఉదయం 7.59 గంటలకు ప్రారంభమైన 22 గంటల కౌంట్‌డౌన్ పూర్తవగానే ఆదివారం ఉదయం 5.59 నిమిషాలకు షార్‌లోని ప్రథమ ప్రయోగ వేదిక నుంచి పీఎస్ఎల్వీ-సీ61 రాకెట్ నిప్పులు చిమ్ముతూ నింగిలోకి పయనమైంది. 8 నిమిషాలకు తన రెండు దశలను సునాయసనంగా పూర్తి చేసుకొంది. మూడో దశలోకి ప్రవేశించగానే సాంకేతిక సమస్య తలెత్తింది. ఘన హైడ్రాక్సిల్-టెర్మినేటెడ్ పాలిబ్యూటాడిన్ (హెచ్‌టీపీబీ) మోటారుతో నడిచే మూడో దశ (పీఎస్3) సరిగ్గా పనిచేయలేదు. దీంతో రాకెట్ గతి తప్పింది. పీఎస్3 దశకు సంబంధించిన డేటా, తయారీ రికార్డులను పరిశీలించేందుకు ఇస్రో ఒక వైఫల్య విశ్లేషణ కమిటీని ఏర్పాటు చేసింది. పీఎస్ఎల్వీ శ్రేణిలో ఇస్రో ఇప్పటివరకూ 63 ప్రయోగాలు చేపట్టగా.. ఇది మూడో వైఫల్యమేనని, 2017 తర్వాత పీఎస్ఎల్వీ రాకెట్ విఫలమవడం ఇదే తొలిసారని ఇస్రో చైర్మన్ నారాయణన్ తెలిపారు.

60 విజయాలు.. 3 వైఫల్యాలు

1969 ఆగస్టు 15న ప్రారంభమైన ఇస్రో.. 1993లో పీఎస్ఎల్వీ రాకెట్ ప్రయోగాలకు ఇస్రో శ్రీకారం చుట్టింది. పీఎస్ఎల్వీ-డీ1 పేరిట 1993 సెప్టెంబరు 20న తొలి ప్రయోగం చేపట్టగా.. నాలుగో దశలో ద్రవ ఇంధనంలో సాంకేతిక లోపం తలెత్తి అది విఫలమైంది. అనంతరం 1994 అక్టోబరు 15న పీఎస్ఎల్వీ-డీ2 ప్రయోగాన్ని విజయవంతంగా చేపట్టారు. అక్కడి నుంచి ఇస్రో వరుసగా 39 విజయాలు సాధించింది. 2017 ఆగస్టు 31న పీఎస్ఎల్వీ-సీ39 రాకెట్ ప్రయోగం విఫలమైంది. ఈ వైఫల్యం తర్వాత 8 ఏళ్లలో పీఎస్ఎల్వీ ద్వారా చేపట్టిన 21 రాకెట్ ప్రయోగాలు వరుసగా విజయం సాధించాయి. తాజాగా పీఎస్ఎల్వీ-సీ61 మూడో దశలో సాంకేతిక లోపం తలెత్తడంతో ప్రయోగం విఫలమైంది.

ఇస్రో జైత్రయాత్రకు బ్రేక్

ఎనిమిదేళ్లుగా 58 విజయాలతో ఇస్రో విజయ పరంపర కొనసాగిస్తోంది. 2017 నుంచి ఈ ఏడాది జనవరి 29 వరకు... పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ, ఎస్ఎస్ఎల్వీ, గగన్‌యాన్-డీ1, ఆర్ఎల్‌వీ-టీడీ ఇలా వరుసగా 58 ప్రయోగాల్లో విజయం సాధించింది. ఈ సక్సెస్‌తో భారత్ అంతరిక్ష పరిశోధనల్లో అగ్రరాజ్యాల సరసన నిలిచింది. ఇందులో చంద్రయాన్-3, ఆదిత్య-ఎల్1, గగన్‌యాన్-డీ1 వంటి ప్రయోగాలు కూడా ఉన్నాయి. ఇప్పుడు దేశ రక్షణ, సైనిక అవసరాలు, సరిహద్దుల్లో నిఘా వ్యవస్థలను బలోపేతం చేయడం కోసం ఈవోఎస్-09ను పంపేందుకు ఆదివారం ఇస్రో చేపట్టిన పీఎస్ఎల్వీ-సీ61 రాకెట్ విఫలమవడంతో వరస విజయాలకు బ్రేక్ పడింది.

ఉక్రెయిన్‌పై 273 డ్రోన్లతో దాడి

కివ్, మే 18: ఉక్రెయిన్‌పై రష్యా మరోసారి భారీ స్థాయిలో 273 డ్రోన్లతో దాడులకు తెగబడింది. డ్రోన్లతో ఉక్రెయిన్‌లోని పలు ప్రాంతాలపై దాడులు చేసింది. ఈ దాడుల వల్ల ఒక మహిళ మృతి చెందగా.. మరో ముగ్గురు గాయాలపాలయ్యారు. 2022లో పూర్తి స్థాయి యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఈ స్థాయిలో భారీ డ్రోన్ దాడి జరగలేదని తెలుస్తోంది. కాల్పుల విరమణ దిశగా మాస్కో, కివ్ మధ్య మొదటిసారి ఇస్తాంబుల్ వేదికగా జరిగిన ముఖాముఖి చర్చలు విఫలమైన నేపథ్యంలో ఈ దాడులు చోటు చేసుకున్నాయి. మరోవైపు ఉక్రెయిన్ కూడా రష్యాలపై డ్రోన్లను ప్రయోగించింది. ఇదిలా ఉండగా.. ఉక్రెయిన్‌లో రక్తపాతానికి ముగింపు పలకడానికి గాను సోమవారం రష్యా అధ్యక్షుడు పుతిన్, తర్వాత ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీతో ఫోన్‌లో మాట్లాడనున్నట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు.

గాజాపై ఇజ్రాయెల్ దాడుల్లో 103 మంది మృతి

గాజా, మే 18: పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులను తీవ్రతరం చేసింది. గాజా స్ట్రిప్ వ్యాప్తంగా శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు జరిపిన వైమానిక దాడుల్లో 103 మంది మరణించారు. ఉత్తర గాజాలోని ప్రధాన ఆస్పత్రిని సైతం మూసివేశారు. ఇజ్రాయెల్ సూచించిన షరతుల మేరకు తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందానికి హమాస్ ఒప్పుకొనేలా ఒత్తిడి పెంచే ప్రణాళికలో భాగమే తాజా భీకర దాడులు. ఖాన్‌యూనిస్ నగరంలోనూ, దాని చుట్టుపక్కల జరిపిన దాడుల్లో ఇళ్లు, పునరావాస టెంట్‌లు ధ్వంసమవడంతో 48 మందికిపైగా మరణించారు. మృతుల్లో 18 మంది చిన్నారులు, 13 మంది మహిళలు ఉన్నారని నస్సెర్ ఆస్పత్రి అధికార ప్రతినిధి వీం ఫేర్స్ చెప్పారు. ఉత్తర గాజాలోని ఇండోనేసియన్ ఆస్పత్రి చుట్టూ దాడులు జరగడంతో ఆస్పత్రిని మూసివేసినట్టు వైద్యాధికారులు తెలిపారు. ప్రస్తుతం ఉత్తర గాజాలో క్షతగాత్రులకు వైద్యసేవలు అందిస్తున్న ప్రధాన ఆస్పత్రి ఇదే. తాజాగా హౌతీ రెబెల్స్ ఇజ్రాయెల్‌పై దాడులు ప్రారంభించారు. దీంతో ఆదివారం ఇజ్రాయెల్‌లోని అనేక ప్రాంతాల్లో సైరన్‌ల మోత మోగింది.

కాల్పుల విరమణకు ముగింపు తేదీ లేదు: భారత్

న్యూఢిల్లీ, మే 18: భారత్, పాకిస్థాన్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలటరీ ఆపరేషన్స్ (డీజీఎంవోఎస్) మధ్య ఆదివారం ఎలాంటి చర్చలూ జరగలేదని భారత సైన్యం స్పష్టం చేసింది. అలాగే ఈ నెల 11న ఇరు దేశాలు తీసుకున్న కాల్పుల విరమణ నిర్ణయానికి 'ముగింపు తేదీ ఏమీ లేదు' అని వెల్లడించింది. రెండు దేశాల మధ్య కాల్పుల విరమణ నిర్ణయం ఈ నెల 18తో ముగుస్తుందని మీడియాలో కథనాలు వస్తున్న నేపథ్యంలో భారత సైన్యం దీనిపై స్పష్టతనిచ్చింది. మరోవైపు, 'ఆపరేషన్ సిందూర్' ప్రతీకార చర్య కాదని.. పహల్గాం ఉగ్రదాడి బాధిత కుటుంబాలకు చేసిన న్యాయమని భారత సైన్యం స్పష్టం చేసింది. పాక్‌లోని ఉగ్రస్థావరాలపై దాడులకు ఎలా ప్రణాళిక రచించింది, సైనికులకు ఏ విధంగా శిక్షణ ఇచ్చింది, ఈ ప్రణాళికను ఎలా అమలు చేసింది.. అనే విషయాలు తెలియజేస్తూ 'ప్లాన్డ్.. ట్రెయిన్డ్.. ఎగ్జిక్యూటెడ్..' పేరుతో ఆర్మీ ఆదివారం ఓ వీడియోను షేర్ చేసింది.

ఆకాశ్ పనితీరు చూడ్డానికి..కలాం ఉంటే బాగుండేది!

» 'ఆంధ్రజ్యోతి'తో డీఆర్‌డీవో మాజీ శాస్త్రవేత్త,ఆకాశ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రహ్లాదరామారావు



అల్వాల్, మే 18(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌కు ప్రతీకారంగా పాక్ మన దేశంపైకి ప్రయోగించిన డ్రోన్లు, క్షిపణులను తుత్తునియలు చేసిన ఆకాశ్ క్షిపణుల తయారీ అబ్దుల్ కలాం కలల ప్రాజెక్టు అని.. దానికి ఆయన హృదయంలో ప్రత్యేక స్థానం ఉందని డీఆర్‌డీవో రిటైర్డ్ శాస్త్రవేత్త, కర్ణాటకకు చెందిన డాక్టర్ ప్రహ్లాదరామారావు పేర్కొన్నారు. ఆకాశ్ పనితీరు చూడటానికి ఆయన ఇక్కడ ఉంటే బాగుండేదని అభిప్రాయపడ్డారు. రక్షణ రంగంలో కీలకమైన ప్రాజెక్టులన్నింటికీ కేంద్రస్థానంగా మారిన హైదరాబాద్ డీఆర్‌డీవోలో అభివృద్ధి చేసిన అనేక రక్షణ ఉత్పత్తులు యుద్ధరంగంలో కీలకపాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం.. ఇంటిగ్రేటెడ్ గైడెడ్ మిస్సైల్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌కు నాయకత్వం వహిస్తున్నప్పుడు రామారావుకు ఆకాశ్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఇక్కడ అత్యంత కీలకమైన బాధ్యత అప్పగించారు. అలా తాము అభివృద్ధి చేసిన ఆకాశ్ క్షిపణులు దాయాది దేశ క్షిపణులను విజయవంతంగా తిప్పికొట్టడం ఆనందం కలిగించిందని.. అది తన జీవితంలోనే అత్యంత సంతృప్తికరమైన రోజని ప్రహ్లాదరామారావు 'ఆంధ్రజ్యోతి'తో అన్నారు. ఆకాశ్ క్షిపణిని అభివృద్ధి చేసే క్రమంలో ఎన్నో సవాళ్లు ఎదురైనప్పటికీ.. కలాం మద్దతుతో ప్రాజెక్టును కొనసాగించామని తెలిపారు.

ఘనంగా నూతన పోప్ ప్రమాణ స్వీకారం



వాటికన్ సిటీ, మార్చి 18: నూతన పోప్ లియో-16 ప్రమాణ స్వీకారం ఆదివారం ఇక్కడ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సెయింట్ పీటర్స్ స్క్వేర్‌లో జరిగిన ప్రారంభ ప్రార్థనకు దాదాపు 2 లక్షల మంది హాజరయ్యారు. వారసత్వంగా వస్తున్న గొర్రెపిల్ల ఉన్నితో చేసిన శాలువాను భుజాలపై వేసినప్పుడు, 'మత్స్యకారుని ఉంగరాన్ని' వేలికి తొడిగినప్పుడు ఆయన ఉద్వేగానికి గురయ్యారు. ఉంగరాన్ని తొడిగిన అనంతరం చేతులను చూసుకొని దండాన్ని ధరించారు. తరువాత ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ ఉత్సవానికి భారత ప్రభుత్వ ప్రతినిధిగా రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ హాజరయ్యారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

గ్యాంగ్‌స్టర్ పాత్రలో కమల్

కమల్ హాసన్ హీరోగా మణిరత్నం దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'థగ్ లైఫ్'. శ్రీయ కథానాయికగా, శింబు కీలక పాత్రలో నటించారు. రాజ్ కమల్ ఫిల్మ్ ఇంటర్నేషనల్, మద్రాస్ టాకీస్, రెడ్ జెయింట్ మూవీస్ సంయుక్తంగా నిర్మిస్తు



న్నాయి. జూన్ 5న థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ ట్రైలర్‌ను విడుదల చేశారు. కమల్ హాసన్ పవర్‌ఫుల్ గ్యాంగ్‌స్టర్ పాత్రలో అదరగొట్టారు. ఈ చిత్రానికి ఏ.ఆర్.రెహ్మాన్ సంగీతం అందించారు. తెలుగులో ఈ సినిమాను ఎన్.సుధాకర్ రెడ్డి విడుదల చేస్తున్నారు.

ఆలయ రక్షణ కోసం..



బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ హీరోలుగా విజయ్ కనకమేడల దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'భైరవం'. డా.జయంతి లాల్ గడా సమర్పణలో కె.కె.రాధామోహన్ నిర్మిస్తున్నారు. ఈనెల 30న చిత్రం విడుదలవుతున్న సందర్భంగా ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ట్రైలర్‌ని లాంచ్ చేశారు. గ్రామంలోని వారాహి ఆలయం చుట్టూ కథ తిరుగుతుంది. రాష్ట్ర దేవాదాయ శాఖమంత్రి ఆలయం భూములపై కన్నేస్తాడు. దాంతో గ్రామంలో శాంతికి భంగం కలుగుతుంది. ఈ క్రమంలో ముగ్గురు స్నేహితులు కలసి ఆలయాన్ని, దాని వారసత్వాన్ని రక్షించేందుకు బలంగా నిలబడతారు. వారి మధ్య ఉన్న బంధం, ధైర్యం గ్రామ ప్రజల్లో ఆశలు చిగురింపజేస్తాయి. ట్రైలర్‌ని బట్టి చూస్తే కమర్షియల్ వాల్యూస్‌తో ఉన్న కథను దర్శకుడు చాలా ప్రభావశీలంగా తెరపై ఆవిష్కరించారనిపిస్తోంది.

కొత్తదనంతో నిండిన చిత్రం



నవీన్ చంద్ర హీరోగా రాకేశ్ పొట్టా తెరకెక్కిస్తున్న చిత్రం 'కరాలి'. మందలపు శివకృష్ణ నిర్మిస్తున్నారు. రాశీ సింగ్, కాజల్ చౌదరి హీరోయిన్లు. ఆదివారం ఈ సినిమాను ప్రారంభించారు. నిర్మాత సాహు గారపాటి క్లాప్ కొట్టి స్క్రిప్టును అందజేశారు. ఈ సందర్భంగా హీరో నవీన్ చంద్ర మాట్లాడుతూ "నేనింతవరకూ ఇటువంటి యాక్షన్ డ్రామా చేయలేదు. కొత్తదనంతో నిండిన ఈ చిత్రం అందరినీ ఆకట్టుకుంటుంది" అని చెప్పారు. ఈ కార్యక్రమంలో నటుడు రాజారవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

హారర్ థ్రిల్లర్ అమరావతికి ఆహ్వానం



శివ కంఠంనేని, ఎస్తర్, ధన్య బాలకృష్ణ, సుప్రీత, హరీశ్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న హారర్, థ్రిల్లర్ 'అమరావతికి ఆహ్వానం' షూటింగ్ పూర్తయింది. ఇప్పటికే ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల్లో షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం కోసం ఇటీవల 20 రోజుల పాటు మధ్యప్రదేశ్‌లో కీలక సన్నివేశాలు చిత్రీకరించారు. జీవీకె దర్శకత్వంలో కె.ఎస్.శంకరరావు, ఆర్.వెంకటేశ్వరరావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా చిత్ర కథానాయకుడు శివ కంఠంనేని మాట్లాడుతూ 'ప్రజెంట్ ట్రెండ్‌ను దృష్టిలో పెట్టుకుని దర్శకుడు జీవీకే ఓ మంచి హారర్, థ్రిల్లర్‌గా ఈ సినిమాను రూపొందిస్తున్నారు. టెక్నికల్‌గా కూడా చిత్రం బాగుంటుంది' అని తెలిపారు. సరికొత్త కథాంశంతో వస్తున్న సినిమా ఇదనీ, ప్రేక్షకుల్ని తప్పకుండా అలరిస్తుందనీ దర్శకుడు చెప్పారు.

నా కెరీర్‌లోనే ప్రత్యేకం

- సుమయ రెడ్డి



'డియర్ ఉమ' సినిమాతో తెరంగేట్రం చేశారు తెలుగమ్మాయి సుమయ రెడ్డి. ఈ సినిమాకు ఆమె నిర్మాతగానూ వ్యవహరించడం విశేషం. ఇందులో ఆమె పోషించిన డాక్టర్ పాత్రకు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ దక్కింది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ 'నా కెరీర్‌లో 'డియర్ ఉమ' ఎంతో ప్రత్యేకమైంది. నటిగా నాకు మంచి బ్రేక్‌తో పాటు ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది. ప్రేక్షకులు అందించిన ఆదరాభిమానాలు మరువలేనివి. ఈ ప్రోత్సాహంతో మరింత ముందుకు సాగుతాను' అని చెప్పారు. త్వరలోనే ఆమె నటిస్తున్న కొత్త ప్రాజెక్ట్ ప్రకటించనున్నారు.

జూన్ నుంచి థియేటర్లు బంద్



తెలుగు రాష్ట్రాల్లో జూన్ 1 నుంచి సినిమా థియేటర్లు బంద్ కానున్నాయి. అద్దె ప్రాతిపదికన సినిమాలు ప్రదర్శించలేమని, థియేటర్లు మూసివేయాలని సినీ ఎగ్జిబిటర్లు కీలక నిర్ణయం తీసుకున్నారు. పర్సంటేజ్ రూపంలో చెల్లిస్తేనే సినిమాలు ప్రదర్శిస్తామని తేల్చి చెప్పారు. ఆదివారం తెలుగు ఫిల్మ్ ఛాంబర్‌లో తెలంగాణ, ఆంధ్రా సినీ ఎగ్జిబిటర్ల సమావేశం నిర్వహించారు. నిర్మాతలు దిల్‌రాజు, సురేశ్‌బాబు సహా 60 మంది ఎగ్జిబిటర్లు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లకు మధ్య చాలా కాలంగా పర్సంటేజీలపై చర్చ సాగుతోంది. రెంటల్ విధానంలో సినిమాలు ప్రదర్శించడం సాధ్యం కాదని ఎగ్జిబిటర్లు వాదిస్తుంటే, పర్సంటేజీలు ఇవ్వలేమని డిస్ట్రిబ్యూటర్లు అంటున్నారు. ఈ వ్యవహారం నిర్మాతలకు సైతం ఇబ్బందిగా మారింది. ఈ క్రమంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిటర్ల సమావేశంలో పర్సంటేజీలు, ప్రభుత్వ విధానాలపై చర్చించారు. పర్సంటేజీల రూపంలో చెల్లిస్తేనే సినిమాలను ప్రదర్శిస్తామని నిర్మాతలకు లేఖ రాయాలని తీర్మానించారు.

ఈ సినిమాలపై ప్రభావం

జూన్ 1 నుంచి థియేటర్లు మూసివేయాలనే ఎగ్జిబిటర్ల నిర్ణయంతో పలు సినిమాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం లేకపోలేదు. ఈ నెలాఖరు నుంచి వరుసగా పెద్ద సినిమాలు రిలీజ్ కానున్నాయి. మే 30న భైరవం, జూన్ 5న థగ్ లైఫ్, జూన్ 12 హరిహర వీరమల్లు, జూన్ 27న కన్నప్ప, జూన్ 20న కుబేర, జూలైలో కింగ్‌డమ్ చిత్రాలు విడుదలకు సిద్ధమవుతున్నాయి.



పంటను పశువులు, పక్షుల నుంచి రక్షించుకునేందుకు ఓ రైతుకు తట్టిన ఆలోచనే ఈ ఫొటో. కాకినాడ జిల్లా తుని మండలం మరువాడలో కూరగాయల పంటకు పాత చీరలను కట్టాడు. ఇది చూసిన పలువురు పాత చీరలను కొత్తగా ఉపయోగించడం బాగుందని కితాబునిస్తున్నారు.

చీరలు కట్టే..రక్షణ పెట్టే

– ఫొటోగ్రాఫర్, కాకినాడ

పాపికొండలకు పోదాం..



పాపికొండలకు గోదావరిలో పర్యాటకులతో వెళ్తున్న బోట్లు

తరలివచ్చిన 600 వందల మంది పర్యాటకులు

దేవీపట్నం/వీఆర్‌పురం, మే 18 (ఆంధ్రజ్యోతి): పాపికొండల అందాలు తిలకించేందుకు ప్రకృతి ప్రేమికులు తరలివచ్చారు. ఆదివారం తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి 600 వందల మంది పర్యాటకులు 13 బోట్లలో పోశమ్మ గండి వద్ద ఉన్న బోట్ పాయింట్ నుంచి బయలుదేరి వెళ్లారు. పూడిపల్లి, దేవీపట్నం, తొయ్యేరు అగ్రహారం, మూలపాడు, మడిపల్లి మంటూరు, నడిపూడి, కచ్చులూరు, తాళ్లూరు కొండ మొదలు గ్రామాల మీదుగా పేరంటాలపల్లి వెళ్లారు. ముందుగా మాతృశ్రీ గండి పోశమ్మను దర్శించుకున్నారు. అనంతరం ప్రకృతి అందాలను ఆస్వాదించారు. గోదావరిలో వెళ్తూ ఎంతో ఆనందంగా గడిపారు.

రిటైర్డు ఎయిర్‌ఫోర్స్ అధికారి స్థలం కబ్జాపై

ఇంటెలిజెన్స్ ఆరా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కాకినాడ రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం 49వ డివిజన్ గైగోలుపాడులో రిటైర్డు ఎయిర్ ఫోర్స్ అధికారి కొత్తపల్లి వెంకటరామానాయుడు-సత్యవతి దంపతులకు చెందిన సర్వే నెం.194/4లో 700 గజాల స్థలం కబ్జాపై ఇంటెలిజెన్స్ విభాగం ఆరా తీసింది. రిటైర్డు ఎయిర్‌ఫోర్స్ అధికారి స్థలం కబ్జాపై ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తకు ప్రభుత్వ ఉన్నతాధికారులు స్పందించారు. ఈ సమస్యపై సమగ్ర వివరాలు సేకరించి నివేదిక అందజేయాలని ప్రభుత్వం ఇంటెలిజెన్స్ విభాగాన్ని ఆదేశించింది. బాధితుడి ఫిర్యాదు మేరకు స్థలం కబ్జాకు పాల్పడిన వైసీపీ నాయకులపై ఇంటెలిజెన్స్ అధికారులు ప్రాథమిక విచారణ చేపట్టి నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపనున్నారు.

మట్టి తవ్వకాల అడ్డగింత

పిఠాపురం రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మండలం ఎఫ్‌కే పాలెంలోని పాపిడిదొడ్డి చెరువులో మట్టి తవ్వకాలకు మరోమారు ప్రయత్నించడం తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. ఎఫ్‌కే పాలెం, విరవాడ గ్రామాల్లో విస్తరించి ఉన్న ఈ చెరువులో మట్టి తవ్వకాలకు విరవాడకు చెందిన మహిళా రైతు పేరుపై అనుమతులు మంజూరయ్యాయి. వీరు కొద్ది రోజులుగా మట్టి తవ్వకాలకు ప్రయత్నిస్తుండగా ఎఫ్‌కే పాలెం గ్రామస్తులు, రైతులు, ఉపాధి కూలీలు అడ్డుకుంటున్నారు. వీరి ఆందోళనలను మట్టి తవ్వకందారులు పట్టించుకోకుండా మరోసారి ఎక్స్‌కవేటర్‌తో తవ్వకాలను ప్రారంభించారు. దీంతో సీపీఎం జిల్లా నాయకుడు దువ్వా శేషబాబ్జీ ఆధ్వర్యంలో నాయకులు కోనేటి రాజు, కుంచే చిన్నా, ఎఫ్‌కేపాలెం గ్రామస్తులు అడ్డుకున్నారు. మట్టి తవ్వకందారులతో పాటు విరవాడ రైతులు అక్కడకు చేరుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. తహశీల్దార్ వీవీ గోపాలకృష్ణ, సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ జానీబాషా ఇరువర్గాలతో చర్చలు జరిపారు. పాడా పీడీ చైత్రవర్షిణి, కాకినాడ ఆర్డీవో మల్లిబాబు, ఇరిగేషన్ ఈఈ శేషగిరిరావు వారితో చర్చలు జరిపారు. తవ్వకాలకు ఒప్పుకునేది లేదని గ్రామస్తులు, రైతులు తేల్చి చెప్పారు.



తవ్వకాలను అడ్డుకుంటున్న దృశ్యం

తప్పిన పెను ప్రమాదం

కోనసీమ జిల్లా నగరం జీసీఎస్ వద్ద జనరేటర్‌లో మంటలు

అదుపుచేసిన ఓఎన్జీసీ సిబ్బంది, ఊపిరి పీల్చుకున్న స్థానికులు



నగరంలోని జీసీఎస్‌లో మంటలు



మంటలను అదుపు చేస్తున్న ఓఎన్జీసీ సిబ్బంది

మామిడికుదురు, మే 18 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం నగరం గ్రామంలోని ఓఎన్జీసీ జీసీఎస్‌లోని జనరేటర్‌లో ఆదివారం సాయంత్రం మంటలు ఏర్పడ్డాయి. అధిక ఉష్ణోగ్రత వల్ల మంటలు ఏర్పడడంతో సంబంధిత అధికారులు సకాలంలో స్పందించి అదుపు చేశారు. జనరేటర్‌లోని మంటలతో పాటు పక్కనే ఉన్న ఎండుగడ్డి అంటుకోవడంతో స్థానికులు భయాందోళన చెందారు. ఓఎన్జీసీకి చెందిన ఫైర్ ఇంజన్లు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపుచేయడంతో పెను ప్రమాదం తప్పింది. జీసీఎస్‌కు నిత్యం సుమారు 13 బావుల నుంచి ముడి చమురు, సహజ వాయువు సరఫరా అవుతోంది. జనరేటర్‌లో మంటలు చెలరేగడంతో ఆయా బావుల్లోని కొన్నింటిని నుంచి ఉత్పత్తిని నిలిపేశారు. జనరేటర్‌లో మంటలు ఏర్పడ్డాయా లేదా పైపులైను లీకై మంటలు ఏర్పడ్డాయాఅని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు మంటలను అదుపు చేయడంతో ప్రమాదం తప్పిందని ఊపిరిపీల్చుకున్నారు.

అయినవిల్లి సిద్ధి వినాయకునికి

రూ.30లక్షల విలువైన బంగారు పాదుకలు



దాతకు స్వామివారి చిత్రపటం బహూకరిస్తున్న ఈవో



వినాయకునికి సమర్పించిన పాదుకలు

అయినవిల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామికి రూ.30లక్షల విలువైన బంగారు పాదుకలను ఆదివారం బహూకరించారు. కొత్తపేట మాజీ ఎమ్మెల్యే మంతెన సుబ్బరాజు వంశవారసులు... వెంకటకృష్ణరాజు- దుర్గావతి దంపతులు, వారి కుమారులు వెంకటసూర్యసుబ్బరాజు-శ్వేత దంపతులు 369 గ్రాములు బంగారు శఠారి (పాదుకలు)ని సమర్పించారు. అర్చకులు వాటికి సంప్రోక్షణ నిర్వహించారు. దాతను శేష వస్త్రంతో సత్కరించి వేదాశీర్వచనం అందజేశారు. ఈవో ముదునూరి సత్యనారాయణరాజు దాతను అభినందించి స్వామివారి చిత్రపటం బహూకరించారు.

'లోవ'కు పోటెత్తిన భక్తులు

ఆలయానికి రూ.4.33 లక్షల ఆదాయం





ఆలయంలో తలుపులమ్మ, వంట చేసుకుంటున్న భక్తులు

తుని రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రం తలుపులమ్మ లోవ దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వేలాదిగా వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పరిసరాల్లో వంట వార్పు చేసుకుని సహపంక్తి భోజనాలు చేశారు. రూ.4.33లక్షల ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈవో విశ్వనాధరాజు తెలిపారు.

ఇంటిని అన్యాయంగా కూల్చేశారు

పిఠాపురంలో మహిళ ఆవేదన

పిఠాపురం, మే 18 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ అధికారులు జారీ చేసిన పట్టా ఉన్నప్పటికి ఆ స్థలంలో తాను కట్టుకున్న ఇంటిని అధికారులు అన్యాయంగా కూల్చివేశారని కాకినాడ జిల్లా పిఠాపురం ఇందిరానగర్‌కు చెందిన మిరియాల సూర్యకుమారి ఆవేదన వ్యక్తం చేసింది. తనకు 2011లో అప్పటి తహశీల్దారు నివేశన స్థల ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేశారని ఆమె ఆదివారం సాయంత్రం విలేకర్లకు తెలిపింది. ఎటువంటి సమాచారం ఇవ్వకుండా తన ఇంటిని అధికారులు కూల్చివేశారని, ఇప్పుడు పిల్లలతో తాను ఎక్కడికి వెళ్లాలని ఆవేదన వ్యక్తం చేసింది. తమ కుటుంబాన్ని డిప్యూటీ సీఎం పవన్ ఆదుకుని న్యాయం చేయాలని కోరుతోంది.



పిఠాపురంలో ఆవేదన వ్యక్తం చేస్తున్న మిరియాల సూర్యకుమారి

లారీ ఢీకొని ఐదుగురికి గాయాలు

కొవ్వూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని ఐదుగురు గాయపడినట్టు కొవ్వూరు పట్టణ హెడ్‌కానిస్టేబుల్ ఎం.సత్యనారాయణ తెలిపారు. జంగారెడ్డిగూడెనికి చెందిన మదంపాటి గణేష్‌కుమార్ ఈనెల 15న తన కుమార్తెలిద్దరితో పాట బావమరిది పిల్లలిద్దరిని మోటార్‌సైకిల్ ఎక్కించుకుని తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం బయలుదేరాడు. కొవ్వూరు గామన్‌బ్రిడ్జిపై 6వ స్తంభం వద్ద ఎదురుగా వెళ్తున్న ఆర్టీసీ బస్సును క్రాస్ చేస్తుండగా ఎదురుగా వస్తున్న లారీ మోటార్‌సైకిల్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో గణేష్‌కుమార్‌తో పాటు నలుగురు పిల్లలకు గాయాలు కావడంతో రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు గణేష్‌కుమార్ ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు సత్యనారాయణ తెలిపారు.

కారు, మోటార్‌సైకిల్ ఎదురెదురుగా ఢీ

ఇద్దరికి గాయాలు



గాయపడిన ఓ వ్యక్తి

సామర్లకోట, మే 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట పట్టణ శివారు కోదండరామపురం మలుపు వద్ద ఆదివారం కారు, మోటార్‌సైకిల్ పరస్పరం ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో మోటార్ సైకిల్ నడుపుతున్న ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. సామర్లకోట నుంచి పిఠాపురం వెళ్తున్న పిఠాపురానికి చెందిన ఇద్దరు సామర్లకోటలో పని ముగించుకుని తిరిగి వెళ్తుండగా కోదండరామపురం మలుపు వద్దకు వచ్చేసరికి పిఠాపురం నుంచి సామర్లకోట వైపునకు వస్తున్న కారు అతివేగంగా ఢీకొనడంతో ఈ ప్రమాదం సంభవించింది. తీవ్రంగా గాయపడిన వారిని చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సామర్లకోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హైస్కూల్‌లో కంప్యూటర్లు, ప్రింటర్లు చోరీ



శంఖవరంలో వివరాలు సేకరిస్తున్న క్లూస్ టీం, పోలీసులు

శంఖవరం, మే 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా శంఖవరం హైస్కూల్‌లో కంప్యూటర్లు, ప్రింటర్లను గుర్తుతెలియని దుండగులు చోరీ చేశారు. ఈమేరకు హెచ్ఎం భాస్కరలక్ష్మీ అన్నవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం మధ్యాహ్నం వరకూ పదోతరగతి విద్యార్థులకు మెమోలు, హాల్‌టికెట్లు అందజేశామని.. ఆదివారం ఉదయం 9 గంటలకు వచ్చి చూసేసరికి ఆఫీసు గది తాళాలు బద్దలుగొట్టి ఉండటం గమనించినట్టు తెలిపారు. ఆఫీసు రూములో 2 కంప్యూటర్లు, 2 ప్రింటర్లు లేవని, మంచినీటి ప్యూరిఫికేషను కోసం తీసుకొచ్చిన రిపేరు సామాన్లు కూడా చోరీకి గురయ్యాయని పేర్కొన్నారు. అన్నవరం ఎస్ఐ శ్రీహరిబాబు క్లూస్ టీం సభ్యులతో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. దీనిపై సమగ్ర విచారణ నిర్వహిస్తామని తెలిపారు.

మద్యంతో వ్యక్తి అరెస్ట్

కొవ్వూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మండలం ధర్మవరం గ్రామంలో కిరాణా దుకాణంలో అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్నారని సమాచారం రావడంతో రూరల్ పోలీసులు దాడి చేశారు. మద్యం విక్రయిస్తున్న కేతాడ గోపిని అరెస్టు చేసి అతడి నుంచి 6 క్వార్టర్ మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

21న జిల్లా విద్యా శాఖ కార్యాలయాల ముట్టడి

ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక తీర్మానం



సమావేశంలో ఐక్యత చాటుతున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు

కాకినాడ రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21న జిల్లా విద్యాశాఖ కార్యాలయాలను ముట్టడించాలని కాకినాడ ఎస్టీయూ భవన్‌లో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మోర్త శ్రీనివాస్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన జిల్లా ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక సమావేశంలో తీర్మానించారు. ఉపాధ్యాయులకు సంబంధించిన పలు విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్ర ఉపాధ్యాయుల సంఘం ఐక్య వేదిక పిలుపు మేరకు తలపెట్టిన ముట్టడి కార్యక్రమానికి సన్నాహక సమావేశం నిర్వహించారు. వివిధ ఉపాధ్యాయ సంఘాల సభ్యులు 9 మందితో స్టీరింగ్ కమిటీ ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయ బదిలీల్లో పోస్టులను బ్లాక్ చేయకూడదని, విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా ప్రాథమిక పాఠశాలల్లో ఇద్దరు ఉపాధ్యాయులుండాలని, ప్రభుత్వ పాఠశాలల్లో సమాంతర మీడియం ఉండాలని, ఉన్నత పాఠశాలల్లో సెక్షన్‌కు 45మంది దాటితే మాత్రమే రెండో సెక్షన్ ఉండాలి వంటి ప్రధానమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని విద్యా శాఖ కార్యాలయాల ముట్టడిని ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

మానసిక స్థితి సక్రమంగా లేని బాలికపై

పలుమార్లు వృద్ధుడి అత్యాచారం

» గర్భవతిని చేసిన వైనం

» తల్లి ఫిర్యాదుతో నిందితుడి అరెస్ట్

ముమ్మిడివరం, మే 18 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని 15 ఏళ్ల బాలికకు 61 ఏళ్ల వృద్ధుడు మాయమాటలు చెప్పి పలుమార్లు అత్యాచారంచేసి గర్భవతిని చేసిన ఉదంతమిది. దీనికి సంబంధించి ముమ్మిడివరం ఎస్ఐ డి.జ్వాలాసాగర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలంలో ఓ గ్రామానికి చెందిన ముడే బాలయోగి అలియాస్ బాలయ్య (61) భార్య మృతిచెందడంతో ఇద్దరు కుమారులు హైదరాబాద్‌లో ఉంటున్నారు. బాలయోగి ఒక్కడే తన ఇంట్లో నివసిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన మహిళ భర్త మృతిచెందడంతో ఇద్దరు కుమార్తెలతో ఇంట్లో ఉంటుంది. చిన్న కుమార్తెకు మానసిక స్థితి సక్రమంగా లేక పదో తరగతి చదివి ఇంట్లోనే ఉంటుంది. ఆ బాలికపై కన్నేసిన బాలయోగి మాయమాటలు చెప్పి మోటారుసైకిల్‌పై తిప్పుతూ నాలుగైదు నెలలుగా పలు సార్లు అత్యాచారం చేశాడు. ఆ బాలిక ఆరోగ్యంలోను, శారీరకంగా మార్పులు రావడాన్ని గమనించిన తల్లి స్థానిక వైద్యులను సంప్రదించి అక్కడి నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించగా బాలిక నాలుగు నెలల గర్భవతిగా నిర్ధారించారు. దీంతో ఆ బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్ఐ జ్వాలాసాగర్ కేసు నమోదు చేశారు.నిందితుడు బాలయ్యను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

భార్యపై భర్త కత్తితో దాడి

అడిగిన వెంటనే

సొమ్ములివ్వలేదని ఆగ్రహం

గొల్లప్రోలు రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): తాకట్టులో ఉన్న ఫోన్ విడిపించుకునేందుకు తాను అడిగిన వెంటనే డబ్బులు ఇవ్వలేదనే కోపంతో భార్యపై భర్త కత్తితో దాడి చేశాడు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలు పాత బ్యాంకు వీధికి చెందిన కిలాడి జ్యోతి చింతపండు వలిచే పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తోంది. భర్త శ్రీను వ్యవసాయ పనులు చేస్తున్నా మద్యానికి బానిస కావడంతో ఇంటి వద్ద డబ్బులు ఇవ్వట్లేదు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. శ్రీను తండ్రి తనకున్న 1.50 ఎకరాల భూమిని మనుమడు కిలాడి శివరాం పేరుపై రాశాడు. అప్పటి నుంచీ కక్ష పెంచుకుని శ్రీను భార్య, పిల్లలను వేధిస్తున్నాడు. తాను సెల్‌ఫోన్ తాకట్టు పెట్టానని, విడిపించేందుకు రూ.2వేలు ఇవ్వాలని అడిగాడు. డబ్బులు లేవని చెప్పడంతో భార్య జ్యోతిపై కత్తితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన ఆమెను పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి



మరణించిన వ్యక్తి

తుని రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతిచెందిన ఘటన కాకినాడ జిల్లా తుని రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. నరసింగపల్లి- బయ్యవరం రైల్వేస్టేషన్ మధ్యలో తుని వైపు వెళ్లే రైలు నుంచి ప్రయాణం చేస్తూ సుమారు 30 ఏళ్ల వ్యక్తి జారి పడి మృతిచెందినట్టు రైల్వే పోలీసులు తెలిపారు. మరణించిన వ్యక్తి వివరాలు కానరాలేదని, బంధువులు ఎవరైనా ఉంటే తుని రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు. మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రిలో భద్రపరిచినట్టు రైల్వే ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



మృతిచెందిన ఆదియ్య

ఉండ్రాజవరం, మే 18 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం చివటం గ్రామపరిధిలో జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం గ్రామానికి చెందిన మట్టపర్తి ఆదియ్య (40) తాడేపల్లిగూడెం నుంచి తణుకు వైపు మోటారుసైకిల్‌పై వస్తుండగా స్థానిక కమ్మకల్యాణమండపం ఎదురుగా జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఆదియ్య తలకు తీవ్రమైన గాయాలు తగలడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. ఎస్ఐ జి.శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ బాలుడు..



ప్రణీత్ (ఫైల్)

యానాం, మే 18 (ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ బాలుడు చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వేసవి సెలవుల నేపథ్యంలో యానాం కనకాలపేట గ్రామంలో తన అమ్మమ్మ పెన్నాడ మంగాదేవి ఇంటికి కాకినాడ జిల్లా కాజులూరు మండలం జగన్నాధగిరికి చెందిన ప్రణీత్ (9) వచ్చాడు. ఈనెల 14న బాత్‌రూంలో స్నానం చేస్తుండగా జారిపోవడంతో మలద్వారం వద్ద ఇనుపరాడ్డు గుచ్చుకుని పెద్దగాయం కావడంతో యానాం ప్రభుతాసుపత్రికి కుటుంబసభ్యులు తరలించారు. చికిత్స చేసిన వైద్యులు ఇంటికి పంపించారు. 16న గాయం ప్రదేశంలో ఇన్‌ఫెక్షన్ కాడంతో ప్రణీత్‌ను తిరిగి ఆసుపత్రికి తీసుకెళ్లగా కాకినాడ ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేశారు. కాకినాడలో వైద్యులు శనివారం ఆపరేషన్ చేసి ఐసీయూకు తరలించారు. ఆదివారం తెల్లవారుజామున బాలుడు మృతిచెందాడు. మృతదేహానికి బంధువులకు అప్పగించారు. యానాం పోలీసులు కేసు నమోదు చేశారు.

21 నుంచి జాతీయ స్థాయి నాటిక పోటీలు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామవరంలో నల్లమిల్లి మూలారెడ్డి కళా పరిషత్ 36వ జాతీయ స్థాయి ఆహ్వాన సాంఘిక నాటిక పోటీలు ఈ నెల 21 నుంచి 24వరకు నిర్వహించనున్నట్టు పరిషత్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. ఆదివారం అనపర్తిలోని ఎన్డీయే కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాటక పోటీలకు స్థానిక నల్లమిల్లి సుబ్బిరెడ్డి స్మారక కళామందిరంలో ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయన్నారు. 21న జనరల్ బోగీలు, కిడ్నాప్, 22న (అ)సత్యం, నాన్న నేనొచ్చేస్తా, 23న విడాకులు కావాలి, కొత్తపరిమళం, నిశ్శబ్దమా నీ ఖరీదెంత, 24న చిగురు మేఘం నాటికలు ప్రదర్శించనున్నారు. సమావేశంలో సాహితీ వేత్త దుర్వ శ్రీరామమూర్తి, సత్తి దేవదానరెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, కర్రి బులిరెడ్డి, ఎన్ఆర్‌కే ప్రసాదరెడ్డి, నల్లమిల్లి సుబ్బారెడ్డి, బాచి, మల్లిడి కృష్ణారెడ్డి, మల్లిడి సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణా తరగతులు

రాజమహేంద్రవరం కల్చరల్, మే 18(ఆంధ్రజ్యోతి): స్థానిక కోరుకొండ రోడ్డులోని రామకృష్ణ మిషన్‌లో బాలబాలికలకు ఏప్రిల్ 24న ప్రారంభమైన వేసవి శిక్షణా తరగతులు ఆదివారం ముగిసాయి. ఈ తరగతుల్లో 190 మంది విద్యార్థులు పాల్గొని వేద పారాయణం, భజనలు, భగవద్గీత, ధ్యానం, యోగాసనాలు, సంగీతం, చిత్రలేఖనం, హస్తకళలు, నీతి కథలు, వ్యక్తిత్వ వికాసం, భారతీయ క్రీడలు మొదలైన వాటిలో శిక్షణ పొందారు. కార్యక్రమంలో స్వామి శశికాంతానందజీ మహరాజ్, స్వామి పరిజ్ఞేయానంద మహరాజ్ పాల్గొని పిల్లలతో రోజూ ధ్యానం చేయించాలని, ఉన్నత విలువలు కలిగిన భావి భారత పౌరులుగా తల్లిదండ్రులు తయారు చేయాలని ఉద్బోధించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, వలంటీర్లు పాల్గొన్నారు.

దంత సమస్యలపై అవగాహన సదస్సు


డాక్టర్లు సుధాకర్, రాధికలను సత్కరిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

రాజమహేంద్రవరం కల్చరల్, మే 18(ఆంధ్రజ్యోతి): స్థానిక వెంకటేశ్వరనగర్‌లోని వాకర్స్ క్లబ్ పార్కు వద్ద జవహర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో దంత సమస్యలపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ ఉండవల్లి సుధాకర్ దంతాలను ఎలా శుభ్రపరచుకోవాలో, దంతాలు శుభ్రంగా లేకుంటే వచ్చే సమస్యలపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా సుధా డెంటల్ హాస్పిటల్ డాక్టర్ రాధిక ఉచితంగా దంత పరీక్షలు నిర్వహించారు. అనంతరం డాక్టర్లను జవహర్ క్లబ్ సభ్యులు సత్కరించారు.

పారిశ్రామిక వేత్త శ్రీనివాసరెడ్డికి పితృవియోగం


సత్తి సూరారెడ్డి

అనపర్తి, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొలమూరు గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త సత్తి శ్రీనివాసరెడ్డికి పితృ వియోగం కలిగింది. ఆయన తండ్రి సత్తి సూరారెడ్డి (90) అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమారులు సత్తి శ్రీనివాసరెడ్డి, కొండారెడ్డి రైస్‌మిల్ రంగంలో ప్రసిద్ధి చెందారు. వారి అభివృద్ధికి సూరారెడ్డి విశేష కృషి చేయడమే కాకుండా గ్రామంలో కమ్యూనిటీ హాళ్ల, దేవాలయాల నిర్మాణాలకు, గ్రామాభివృద్ధికి విరాళాలు అందించి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సూరారెడ్డి మృతి పట్ల ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, నల్లమిల్లి శేషారెడ్డి, పుదుచ్చేరి మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు, తెలుగు ఫిలిం చాంబర్ అధ్యక్షుడు భరత్ భూషణ్, గజల్ శ్రీనివాస్, జడ్పీ మాజీ ప్రతిపక్ష నాయకుడు సత్తి రామారెడ్డి, జిల్లా రైస్ మిల్లర్స్ అధ్యక్షుడు కర్రి వెంకటరెడ్డి సంతాపం ప్రకటించారు.

సీతారాంపురం క్రికెట్ టోర్నీ విజేత నిడిగట్ల

రాజానగరం, మే 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారాంపురంలో నిర్వహిస్తున్న శివాజీ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. 15 రోజులుగా హోరాహోరీగా జరిగిన పోటీల్లో భాగంగా గాదరాడ-నిడిగట్ల జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో నిడిగట్ల జట్టు విజయం సాధించింది. విన్నర్స్, రన్నర్స్‌కు నగదు బహుమతులతో పాటు జ్ఞాపికలను అందజేశారు. అడబాల తేజ, సూరపురెడ్డి వాసు ఆధ్వర్యంలో జరిగిన ఈ టోర్నమెంట్‌లో రాజానగరం, కోరుకొండ, గోకవరం, రాజమహేంద్రవరం రూరల్, రంగంపేట, గండేపల్లి, జగ్గంపేట మండలాల్లోని దాదాపు 32 గ్రామాలకు చెందిన టీమ్‌లు పాల్గొన్నాయి. కార్యక్రమంలో గ్రామ పెద్దలు అడబాల చినబాబు, అడబాల ఆదివిష్ణు, పలివెల గోవిందు తదితరులు పాల్గొన్నారు.

నేడు బలభద్రపురంలో మినీ మహానాడు

అనపర్తి ఇన్‌చార్జి మనోజ్‌రెడ్డి


కోటపాడులో బీమా చెక్కును అందజేస్తున్న మనోజ్‌రెడ్డి

అనపర్తి, మే 18(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ మినీ మహానాడు సోమవారం బిక్కవోలు మండలం బలభద్రపురంలోని ఎంఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్టు పార్టీ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం రామవరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మధ్యాహ్నం 3గంటల నుంచి మహానాడు ప్రారంభమౌతుందని, నాలుగు మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు తప్పక హాజరు కావాలని చెప్పారు.

కార్యకర్త కుటుంబానికి బీమా చెక్కు

రంగంపేట, మే 18 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వం ఉంటే కుటుంబానికి భరోసా ఉన్నట్టే అని కార్యకర్త ప్రమాదవశాత్తూ మరణిస్తే కుటుంబ సభ్యులంతా రోడ్డున పడకుండా ఆ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి అన్నారు. ఇటీవల కోటపాడు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త అర్జంగి ఆనందరావు స్థానిక అంబేడ్కర్ కోళ్ల ఫారమ్ వద్ద లారీ ఢీకొనడంతో మృతిచెందాడు. ప్రమాదం వివరాలు స్థానిక నాయకుల ద్వారా పార్టీ కార్యాలయానికి తెలియపరచి సంబంధిత పత్రాలు అందించడంతో టీడీపీ తరుపున ప్రమాద బీమా రూ.5 లక్షల చెక్కును ఆదివారం మనోజ్‌రెడ్డి కోటపాడులో ఆనందరావు భార్యకు అందించి పిల్లలను బాగా చదివించాలన్నారు. మీ కుటుంబానికి తెలుగుదేశం పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవిందు, నిమ్మలపూడి కాటన్, అచంట వెంకటేష్, కోనే వెంకన్న, దేసిన సత్యనారాయణ,నిమ్మన గిరి, దాసరి నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు కనుమరుగు

మరుగుదొడ్లు లేక మహిళా రైతులు, వ్యాపారులకు తీవ్ర ఇబ్బందులు



రాజమహేంద్రవరంలోని వై-జంక్షన్(ఆర్ట్స్ కళాశాల) వద్ద రైతు బజార్

- ఆర్ట్స్ కళాశాల రైతు బజార్‌లో కనీస సౌకర్యాలు కరువు
- తాగేందుకు నీరు కూడా ఉండదు
- మూలకు చేరిన ఆర్వో ప్లాంటు
- షెల్టర్ లేని ఎస్టేట్ ఆఫీసర్
- నిరుపయోగంగా సెంట్రల్ జైలు షాపు

రాజమహేంద్రవరం అర్బన్, మే 18 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నడిబొడ్డున, వై.జంక్షన్ సమీపంలోని ఆర్ట్స్ కళాశాల రైతు బజార్‌లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ఇక్కడి రైతులు, డ్వాక్రా మహిళలు, ఇతర వ్యాపారులకు రైతుబజార్‌లో కనీస సౌకర్యాలు లేకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇదే సమయంలో కొనుగోలుదారులకు సైతం ఇక్కట్లు తప్పడంలేదు. ప్రధానంగా మహిళా రైతులు, డ్వాక్రా మహిళలు మరుగు కోసం పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు. ఎవరికీ చెప్పుకోలేక ఆవేదన దిగమింగుకుంటున్నారు. ఉదయమే రైతుబజార్‌కు వచ్చి ఒకసారి రైతుబజార్‌లోని షాపులో కూర్చుంటే మళ్లీ రాత్రికే ఇంటికి వెళ్లాల్సి ఉంటుంది. అప్పటి వరకూ అన్నీ బంద్ అనే రీతిలో ఇక్కడి పరిస్థితులు ఉన్నాయి. దీంతో మహిళల పరిస్థితి దారుణంగా ఉంటోంది. అలాగే, ఇక్కడ తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. కనీసం మంచినీళ్ల కుళాయి కూడా లేదు. బోరు ఉన్నా తాగేందుకు పనికి రాదు. దీంతో డబ్బులు చెల్లించి బయటి నుంచి వాటర్ టిన్నులు తెచ్చుకుంటున్నారు. గతంలో పేపర్ మిల్లు సౌజన్యంతో రైతు బజార్ ఎదుట ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేసినా దాని నిర్వహణ పట్టించుకోకపోవడంతో మూలనపడింది. శిథిలావస్థకు చేరింది. దీన్ని వినియోగంలోకి తీసుకొచ్చే ఆలోచన చేయడంలేదు. రైతుబజార్‌లో 53 మంది రిజిస్టర్డ్ రైతులు, 11 డ్వాక్రా షాపులు, రెండు కిరాణా, ఇతర వ్యాపారులు ఉంటే వీరిలో అధిక శాతం మంది మహిళలే ఉన్నారు.


చిన్న ఇరుకుగదిలో విధులు నిర్వర్తిస్తున్న ఎస్టేట్ ఆఫీసర్

నిలువ నీడ లేని ఎస్టేట్ ఆఫీసర్

రైతుబజార్ దైనందిన కార్యకలాపాలను పర్యవేక్షించే ఎస్టేట్ ఆఫీసర్‌కు కనీసం ఆఫీస్ రూం కూడా లేకపోవడం గమనార్హం. వ్యాపారుల కోసం కేటాయించిన మూలన ఉన్న ఒక చిన్న ఇరుకు గదిలో కూర్చుని రైతుబజార్‌ను పర్యవేక్షిస్తుంటారు. గదిలో కూర్చుంటే బయట ఏం జరుగుతుందో కూడా తెలిసే అవకాశం ఉండదు. అంత చిన్నగా గది ఉంటుంది. ఉన్నతాధికారులకు డైలీ రిపోర్టులు పంపాలన్నా, కార్యాలయానికి సంబంధించిన స్టేషనరీ, ఇతర పరికరాలు భద్రపరచాలన్నా ఆ చిన్నగదిలోనే సర్దుకుపోవాల్సి ఉంటుంది. ఎస్టేట్ ఆఫీసర్ కూడా ఇబ్బందులు పడుతూనే విధులు నిర్వర్తించాల్సిన దుస్థితి ఇక్కడ ఉంది.



ఆర్వో ప్లాంటు దుస్థితి

తెరుచుకోని సెంట్రల్ జైలు షాపు

ఆర్ట్స్ కళాశాల రైతుబజార్ నిర్మాణ సమయంలో అధికారులు సెంట్రల్ జైలుకు ఒక షాపును కేటాయించారు. కొన్నాళ్లపాటు ఈ షాపులో సెంట్రల్ జైలు ఖైదీలు తయారు చేసిన బిస్కెట్లు, ఇతర తినుబండారాలను విక్రయించారు. కొన్ని నెలల నుంచి ఇక్కడ విక్రయాలు ఆపేసి షట్టర్ మూసేశారు. దీంతో ఇది నిరుపయోగంగా ఉంది. వేరేవాళ్లకు ఇవ్వరు, వాళ్లు వాడుకోరు అన్నట్టుగా ఉంది. ఈ షాపు పరిస్థితి. సమస్యలు ఇక్కడ రాజ్యమేలుతున్నా మార్కెటింగ్‌శాఖ ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు తమ సమస్యలపై దృష్టిసారించాలని రైతుబజార్‌లోని రైతులు, వ్యాపారులు, ముఖ్యంగా మహిళా రైతులు వేడుకుంటున్నారు.

మహనీయుల విగ్రహాలు భావి తరాలకు స్ఫూర్తి

తాండ్ర పాపారాయుడు, ఎర్రన్నాయుడు విగ్రహాల ఆవిష్కరణలో ఎమ్మెల్యే వాసు


విగ్రహాలను ఆవిష్కరించిన ఎమ్మెల్యే వాసు, ఆదిరెడ్డి అప్పారావు

రాజమహేంద్రవరం సిటీ, మే 18(ఆంధ్రజ్యోతి): మహనీయుల విగ్రహాలు భవిష్యత్ తరాలకు స్ఫూర్తినిస్తాయని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. స్థానిక వీఎల్ పురం సెంటర్‌లో వెలమ సంక్షేమ సంఘం, ఉద్యోగుల సంఘం వెలమ యువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బొబ్బిలి పులిగా చరిత్ర గాంచిన తాండ్ర పాపారాయుడు, కేంద్ర మాజీ మంత్రి కింజరపు ఎర్రన్నాయుడు విగ్రహాలను మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, వెలమ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు చల్లా శంకర్రావులతో కలిసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ విగ్రహావిష్కరణ నిరాడంబరంగా చేసినప్పటికీ ఎర్రన్నాయుడి జయంతి, వర్ధంతులు పండుగ వాతావరణంలో నిర్వహిస్తామన్నారు. త్వరలో నగరంలో ప్రముఖ గాయకుడు మంగళంపల్లి బాలమురళీకృష్ణ, ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహాలను ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే నగరంలోని పలు ప్రాంతాల్లో బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. బీసీలంతా కలిసిమెలిసి వుంటారని అందుకే తన తల్లి మేయర్, తండ్రి ఎమ్మెల్సీ భార్య ఎమ్మెల్యేగా చేసినా, ఇప్పుడు తాను ఎమ్మెల్యే చేసినా వారి అభిమానం వల్లనే నన్నారు. ఆదిరెడ్డి అప్పారావు మాట్లాడుతూ ఎర్రన్నాయుడు వల్లనే వాసు రాజకీయాల్లోకి అడుగుపెట్టారన్నారు. కార్యక్రమంలో వెలమ సంఘం నగర అధ్యక్షుడు కిలపర్తి శ్రీనివాస్, కోళ్ల బాబు, సప్పా వెంకటరమణ, చల్లా బాల మురళీకృష్ణ, కొల్లిబుజ్జి, వాసిరెడ్డి బాబి, అల్లు బాబి, వాసిరెడ్డి కృష్ణ పాల్గొన్నారు.

కోటసత్తెమ్మకు పూజలు

నిడదవోలు, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మరాజుపాలెంలో కోటసత్తెమ్మ దేవస్థానంలో ఆదివారం విశేషపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి సుప్రభాత సేవ, ధూపహారతి, నిత్యార్చన, లలితా పారాయణం, సహస్ర నామ కుంకుమ పూజలు జరిపారు. అనంతరం క్షీర, మహానివేదన చేశారు. దీనిలో భాగంగా ప్రత్యేక పూలతో అమ్మవారిని అలంకరించగా, భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆదివారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో పలు జిల్లాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ప్రత్యేక దర్శనం అన్నదాన విరాళాలు, ప్రసాదం, పూజ టికెట్ల విక్రయాలు, విరాళాల ద్వారా రూ.1,62,543 ఆదాయం వచ్చినట్టు సహాయ కమిషనర్, వి.హరి సూర్యప్రకాష్ తెలిపారు.


వీరవరం జడ్పీ హైస్కూల్ 1999-2000 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు


కోరుకొండ హైస్కూల్ 2007-08 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

కడియం, మే 18(ఆంధ్రజ్యోతి): వీరవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో 1999-2000 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో కలుసుకున్నారు. ఆప్యాయంగా పలకరించుకున్నారు. వారు చేస్తున్న ఉద్యోగాలు, స్థిరపడిన ప్రాంతాలు, కుటుంబ సభ్యుల నేపథ్యం వంటి వాటిని ఒకరికొకరు చెప్పుకున్నారు. నాడు తరగతి గదుల్లో చేసిన అల్లర్లను, మధురానుభూతులను గుర్తు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులు కె.వీరభద్రరావు, ఆర్వీ రమణ, ఎంవీఎస్ఎల్ఆర్ శర్మ, పి.సుబ్బలక్ష్మి, చిలుకూరి శ్రీనివాసరావు, ఎస్.భాస్కరావు, శీలం సుబ్బారావుతో పాటు గ్రామ నాయకుడు బత్తుల రాములను సత్కరించారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. వారి కలయికకు గుర్తుగా పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ సమ్మేళనానికి మునిని శ్రీనివాస్, బచ్చు శ్రీకాంత్, బి.సత్యకిషోర్, బచ్చు అయ్యప్ప, జి.రాంబాబు, ఆర్‌వీవీ కుమార్, కేవీవీ సత్యనారాయణ, గుండాల వీరన్న సారథ్యం నిర్వహించారు.

గోకవరం: గోకవరం జడ్పీ ఉన్నత పాఠశాల్లో 2000-01 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులందరూ స్థానిక సూర్య ఫంక్షన్ హల్‌లో కలుసుకున్నారు. 25 ఏళ్ల తర్వాత కలుసుకున్న వీళ్లంతా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ, నాటి మధురానుభూతులను గుర్తు తెచ్చుకుని సరదాగా గడిపారు. సహపంక్తి భోజనాలు చేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు.

రాజానగరం(కోరుకొండ): కోరుకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2007-2008 విద్యా సంవత్సరంలో పదో తరగతి అభ్యసించిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆప్యాయంగా పలుకరించుకుని ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనాటి మధురానుభూతులను మననం చేసుకుంటూ ఉత్సాహంగా, ఉల్లాసంగా ఆటపాటలతో సందడి చేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను సత్కరించారు.


గోకవరం జడ్పీ హైస్కూల్ 2000-01 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

సిందూర్ విజయం దేశానికే గర్వకారణం

విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు


గోకవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

గోకవరం, మే18(ఆంధ్రజ్యోతి):ఆపరేషన్ సిందూర్ విజయం భారతావనికి గర్వకారణమని విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు అన్నారు. ఈ విజయానికి కృషి చేసిన ప్రతీ సైనికుడికి సలాం చేస్తున్నట్టు తెలిపారు. ఈ పోరాటంలో అమరులైన సైనికులకు శ్రద్ధాంజలిని ఘటించారు. ఆపరేషన్ సిందూర్ విజయ వంతం కావడంతో గోకవరంలో ఆదివారం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఆయన పిలుపు మేరకు వివిధ గ్రామాల నుంచి జనం తరలివచ్చి దేశ భక్తిని చాటారు. 330 అడుగుల జాతీయ జెండాతో ప్రధాన రహదారిపై ఈ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉగ్రమూకల పాశవిక దాడికి ప్రతిచర్యగా ఆపరేషన్ సిందూర్ దేశ భక్తిని ప్రపంచానికి చాటిందన్నారు. ఉగ్రవాదంపై పోరాటం చేస్తున్న ఏకైక నాయకుడు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ మాత్రమేనన్నారు. భారత సైన్యానికి ప్రతీ పౌరుడు అండగా నిలబడాలన్నారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు, రామసేన సభ్యులు పాల్గొన్నారు.

కానరాని బీజేపీ నాయకులు

గోకవరంలో బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన తిరంగా ర్యాలీలో భారతీయ జనతా పార్టీ నాయకులు కానరాకపోవడం చర్చనీయాంశమైంది. కాకినాడ జిల్లా జగ్గంపేటలో ఆదివారం నియోజకవర్గ స్థాయిలో బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్నట్టు పార్టీ అధిష్ఠానం పిలుపునిచ్చింది. అదే సమయంలో గోకవరంలో కూడా ఆపరేషన్ సిందూర్ విజయవంతంపై ర్యాలీ చేపట్టేందుకు శ్రీనివాసరావు ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలో పార్టీ అధిష్ఠానం పిలుపునకు గౌరవం ఇచ్చి స్థానికంగా ఉన్న బీజేపీ అగ్రనాయకులందరూ జగ్గంపేటలో జరిగిన తిరంగా ర్యాలీలో పాల్గొన్నారు. దీంతో స్థానికంగా జరిగిన తిరంగా ర్యాలీలో అసలైన బీజేపీ నాయకులెవ్వరూ పాల్గొనక పోవడంతో ర్యాలీ కళ కోల్పోయినట్టు కనిపించింది.

నేటి నుంచి టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

బిక్కవోలు, మే 18(ఆంధ్రజ్యోతి): స్థానిక ఉన్నత పాఠశాలలో సోమవారం నుంచి ఈనెల 28 వరకూ పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్టు మండల విద్యాశాఖాధికారి సీహెచ్‌వీవీ సత్యనారాయణ ఆదివారం తెలిపారు. అనపర్తి, బిక్కవోలు మండలాల నుంచి 236 మంది విద్యార్థులు ఇక్కడ పరీక్షలు రాస్తారన్నారు. ఇందు కోసం 8రూమ్‌లు, 8 మంది ఇన్విజిలేటర్లను ఏర్పాటుచేశామన్నారు.

ఘనంగా ముగిసిన పాశాలమ్మ జాతర

కొవ్వూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): ఆరికిరేవుల గ్రామదేవత పాశాలమ్మ జాతర ఆదివారం ముగిసింది. ఈనెల 14 నుంచి జాతర నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఆఖరి రోజు మొక్కులు తీర్చుకుని, అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. వారం రోజులుగా గ్రామంలో గరగనృత్యాలు, బుట్టబొమ్మలతో అమ్మవారిని గ్రామపురవీధుల్లో ఊరేగించారు. గుడి సేవ, బలిచేట ఊరేగింపు వంటి కార్యక్రమాలను నిర్వహించారు.

హైందవ జీవన విధానం అత్యంత ప్రశస్తం


సమావేశంలో మాట్లాడుతున్న శాంతకుమారి

దివాన్‌చెరువు, మే18 (ఆంధ్రజ్యోతి): హైందవ కుటుంబం జీవనవిధానం అత్యంత ప్రశస్తమైనదని రాష్ట్ర సేవికా సమితి అఖిల భారత ప్రముఖ సంచాలిక వందనీయ శాంతకుమారి అన్నారు. రాష్ట్ర సేవికా సమితి ఏటా నిర్వహించే శిక్షణా కార్యక్రమం ప్వఏశ్, ప్రబోధ్ శిక్షావర్గ్ దివాన్‌చెరువులోని శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో నిర్వహించారు. ఆదివారం జరిగిన ముగింపు కార్యక్రమం సార్వజనికోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శాంతకుమారి మాట్లాడుతూ మహిళలే ఈ హైందవ సంస్కృతిని సంరక్షించే సామర్థ్యం కలిగి ఉంటారని, సమితి మహిళలకు అటువంటి ప్రేరణను కలిగించే కార్యాన్ని చేపట్టిందన్నారు. రాష్ట్రంలోని 33 ప్రదేశాల నుంచి 88 మంది శిక్షార్థులు పాల్గొన్నారు. వారికి యోగ, దండ, యష్టి వంటి శారీరక శిక్షణలే కాకుండా దేశభక్తి, జాతీయభావనలు పెంపొందించే అనేక రకాల విషయాలు బోధించినట్టు నిర్వాహకులు పేర్కొన్నారు.

'బదిలీల్లో ఉత్తమోపాధ్యాయులకు అన్యాయం'

కడియం, మే 18(ఆంధ్రజ్యోతి): గత బదిలీల్లో ఉత్తమోపాధ్యాయులకు పాయింట్లు ఇచ్చారని, ఈ బదిలీల్లో ఉత్తమ ఉపాధ్యాయులకు అన్యాయం జరుగుతోందని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, కడియం ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు గొల్లపల్లి సత్యనారాయణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యా య బదిలీలు నిర్వహించేందుకు సిద్ధపడుతున్న నేపథ్యంలో ప్రిఫరెన్షియల్ కేటగిరిల్లో ప్రత్యేక పాయింట్లు కేటాయించారన్నారు. స్కౌట్, ఎన్ సీసీ, రాష్ట్ర సంఘ నాయకులు, రాష్ట్ర, జాతీయస్థాయిలో ఉత్తమోపాధ్యాయ అవార్డు పురస్కారాలు పొందిన వారికి ఎటువంటి పాయింట్లు కేటాయించలేదన్నారు. భార్యాభర్తలు ఉద్యోగులైనా, దివ్యాంగులు, విధవరాండ్రు, అవివాహితులు వారికి ప్రత్యేక పాయింట్లు ఇస్తున్నారన్నారు. బోధనతోపాటు బోధనేతర పనులు, పా ఠశాలల అభివృద్ధికి కృషి చేయడం, పాఠ్యపుస్తకాల తయారీ, ఆర్పీగా సేవలందిస్తే ఇచ్చే రాష్ట్ర, జాతీయ స్థాయి పురస్కారానికి ప్రాధాన్యం లేద ని, ఉత్తమోపాధ్యాయులకు అన్యాయం జరుగుతోందని సత్యనారాయణ అన్నారు.

(రాజమహేంద్రవరం)

శ్యామల	: శుభం
సూర్యమినీ	: ఫైనల్ డెస్టినేషన్
సూర్యప్యాలస్	: మిషన్ ఇంపాజిబుల్
స్వామి	: మిషన్ ఇంపాజిబుల్
శివజ్యోతి	: హిట్-3
అనుశ్రీ(సాయికృష్ణ)	: ఫైనల్ డెస్టినేషన్
రాజా	: ఫైనల్ డెస్టినేషన్
ఊర్వశి	: లవ్‌లీ
రంభ	: 23
మేనక	: ఎలెవన్
అప్సర	: సింగిల్
కుమారి	: మిషన్ ఇంపాజిబుల్
అశోక	: ఫైనల్ డెస్టినేషన్
వీఎస్ మహల్(నామవరం)	: మిషన్ ఇంపాజిబుల్
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: మిషన్ ఇంపాజిబుల్
వెంకటసూర్య(కడియం)	: ఫైనల్ డెస్టినేషన్
సత్యగౌరి (అనపర్తి)	: సింగిల్
సూర్యశ్రీ (అనపర్తి)	: హిట్-3
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: సింగిల్
రామకృష్ణ(కోరుకొండ)	: ----
గీతాసినిమాస్ (సీతానగరం)	: హిట్-3
శ్రీనివాస (గోకవరం)	: ఫైనల్ డెస్టినేషన్
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: హిట్-3
లలితామహాల్(రంపచోడవరం)	: హిట్-3
నవయుగ(చింతూరు)	: ----



రాజమహేంద్రవరానికి చెందిన ధీరజ్‌కు జ్వరం రావడంతో ఒక ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లాడు.. డాక్టర్ ఏమిటి సమస్య అని అడిగి సుమారు 10కి పైనే టెస్ట్‌లు రాశాడు.. అది చూసి ధీరజ్ ఆశ్చర్యపోయాడు.. ఇవన్నీ చేయించాలా సార్ అని అడిగాడు.. అందుకే రాసిచ్చింది అంటూ డాక్టర్ సీరియస్ అయ్యాడు.. ధీరజ్ టెస్ట్‌లన్నీ చేయించుకున్నాడు. అంతా బాగానే ఉందని రిపోర్టు వచ్చింది.. ఆ రిపోర్టు చూసి డాక్టర్ బాగానే ఉందని చెప్పి పంపించాడు.. దీనికి ఖర్చెంతయ్యిందో తెలుసా.. అక్షరాలా రూ.5 వేలు.. గతంలో అయితే నాడి పట్టుకుని చూసి రోగం ఏంటో చెప్పేవారు.. మరి నేడు వైద్య వృత్తి వ్యాపారంగా మారిపోయింది. టెస్ట్ చేయించనిదే రోగమేంటో చెప్పలేని దుస్థితిలో వైద్యులు తయారయ్యారు.. ఎందుకంటే వైద్యులకు డబ్బు జబ్బు పట్టుకుంది. ల్యాబ్‌కు ఒక టెస్ట్ రాస్తే.. ఫీజు రూ.100 అనుకుంటే.. డాక్టర్‌కు రూ.60.. ల్యాబ్‌కు రూ.40.. దీంతో ల్యాబ్‌లు ఇబ్బడిముబ్బడిగా పుట్టుకొస్తున్నాయి.

ఒక మహిళకు సైనసైటిస్ ఉందని వైద్యుడు సీటీ స్కానింగ్ రాశారు. ఆ సీటీ స్కానింగ్ చేయించుకొని ఆ వైద్యుడి వద్దకు వెళితే మందులిచ్చారు. కానీ తగ్గుము ఖం పట్టలేదు. దీంతో ఆమె మరో వైద్యుడి వద్దకు వెళ్లారు. అక్కడ స్కానింగ్ ఫిల్మ్ చూసిన డాక్టర్.. అసలు వ్యాధి సైనసైటిస్ కాదని అనుమానించి మరో సారి స్కానింగ్ రాశారు. దీనిని మరో ల్యాబ్‌లో చేయించు కోగా కణితి ఉందని రిపోర్టులో రాశారు. బయాప్సీ చేయగా నాసో ఫరింజల్ కార్సినోమా(క్యాన్సర్) అని తేలింది. ముందు స్కానింగ్‌కీ, రెండో స్కానింగ్‌కీ మధ్య నెల గడిచిపోయింది. దీంతో క్యాన్సర్ రెండో స్టేజికి వెళ్లిపోయింది. అదే ముందు స్కానింగ్ రిపోర్టులోనే గుర్తించి ఉంటే.. మరి దీనికి బాధ్యులు ఎవరు?.. ఈ ఒక్క ఉదాహరణ చాలు.. ప్రైవేటు ల్యాబ్‌లు ప్రజల ప్రాణాలతో ఎలా ఆడుకుంటున్నాయో తెలియడానికి!

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఒకనాడు ల్యాబ్‌లో పరీక్ష చేయించాలంటే రోగులకు అనవసరపు ఖర్చు ఎందుకా అని వైద్యులు ఆలోచించేవారు.. నేడు కోట్లు ఖర్చు పెట్టి చదువుతున్నారు..ఆ జాలి లేదు. దయ లేదు..ఎంత వస్తే అంత రానీ అంతే. ప్రస్తుతం ఎలా ఉందంటే జ్వరం వచ్చిందా?.. టెస్టులు చేయించేయండి. తలపోటా? ఎందుకైనా మంచిది సీటీ స్కాన్ చేయించేద్దాం. ఇలా రోగుల భయాన్నే పెట్టుబడిగా పెట్టి మెడికల్ ల్యాబ్‌లు దందా సాగిస్తున్నాయి. దీంతో ప్రైవేటు ల్యాబ్‌ల వ్యాపారం జోరుగా సాగుతోంది. ఉదాహరణకు షుగర్(మధుమేహం) టెస్టు చేయాలంటే ల్యాబ్‌లకు రూ.20 ఖర్చవుతుంది. కానీ రూ.150 వరకూ లాగేస్తున్నారు. ఇదిలా ఉంటే.. చట్ట వ్యతిరేకంగా గర్భస్థ శిశు నిర్ధారణ జరుగుతోందనే ఆరోపణలున్నాయి.. అధికారులు మాత్రం మామూళ్లు చేజారిపోతాయనే భయంతో తనిఖీలకు జంకుతున్నారు. కొన్ని ల్యాబ్‌లలో అనధికారికంగా లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్టు సమాచారం.

జిల్లాలో 350 ల్యాబ్‌లు..

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో చిన్న, పెద్ద ల్యాబ్‌లు 350 వరకూ ఉన్నాయి. ఇవి రిజిస్ట్రేషన్ అయినవి..ఏ అనుమతులూ లేకుండా నడుస్తున్నవి మరో అన్ని ఉంటాయి. దాదాపుగా అన్ని ల్యాబ్‌ల వాళ్లకూ డాక్టర్లతో కనెక్షన్ ఉంటోంది. దీంతో అవసరం లేకపోయినా వైద్య పరీక్షలు రాస్తున్నారు. ల్యాబ్ పేరుతో ఉన్న చీటీపైనే వైద్యుడు ఏమి పరీక్షలు కావాలో రాస్తాడు. దీంతో అదే ల్యాబ్‌కి వెళ్లాల్సి వస్తోంది. అక్కడి ఎంత మొత్తం అడిగితే అంతా జమ చేయాల్సిందే. ఒక వైద్యుడు రాయగా టెస్టులు చేయించుకొని.. ఆ రిపోర్టులను మరో వైద్యుడికి చూపిస్తే.. అబ్బే అవి పని చేయవంటూ మళ్లీ మొదటి నుంచీ అన్ని టెస్టులూ రాస్తున్నారు.దీంతో మళ్లీ వైద్య పరీక్షలు చేయించుకోవాల్సి వస్తోంది. సాధారణ జలుబుకు సైతం చాంతాడంత వైద్య పరీక్షల జాబితా ఇస్తున్నారు.ఎందుకంటే ల్యాబ్‌లు వసూలు చేసే సొమ్ముల్లో గరిష్ఠంగా 60 శాతం వరకూ వైద్యుల కమిషన్ ఉం టోందని చెబుతున్నారు.ఆర్‌ఎంపీ తీసుకెళితే 30 శాతం వరకూ ముడుతోందట. కార్పొరేట్ ఆస్పత్రుల్లో డాక్టర్లకు టార్గెట్‌లు విధించడంతో విధిలేని పరిస్థితుల్లో కొందరు వైద్యులు ఎడా పెడా వైద్య పరీక్షలు రాస్తున్నారని చెబుతున్నారు.

డాక్టర్ల చీటీతో..ల్యాబ్‌ల దోపిడీ

- జ్వరమని వెళ్లినా పరీక్షే
- నాడి పట్టుకోకుండానే చీటి
- టెస్ట్ రిపోర్టు వస్తేనే వైద్యం
- రోగుల జేబులు ఖాళీ
- ఉమ్మడి జిల్లాలో 350 ల్యాబ్‌లు
- అనుమతిలేనివి డబుల్
- వైద్యాధికారులకు మామూళ్లు
- ఎక్కడా కానరాని ధరల పట్టికలు
- తనిఖీలు చేయని వైనం

కానరాని ఫీజు బోర్డులు..

మెడికల్ ల్యాబొరేటరీల్లో ఆయా వైద్య పరీక్షలకు సంబంధించి ధరల పట్టికలు ఉండాలి. కానీ అధిక శాతం ల్యాబ్‌లలో అవి కానరావు. ఒకవేళ పెడుతున్నా అవి ఎక్కడ ఉన్నాయో వెతుక్కోవాల్సిందే.. లేదంటే చాలా చిన్న అక్షరాలతో ఉంటున్నాయి. రోగులు ధరలపై ప్రశ్నించే అవకాశమే ఉండదు. ఇదే అదునుగా ఇష్టానుసారం ధరలను పిండేస్తున్నారు. ఒకే రకం టెస్టుకు ఒక ల్యాబ్‌కి మరో ల్యాబ్‌కి సంబంధం ఉండడం లేదు. తూర్పు గోదావరిలో 107, కాకినాడ జిల్లాలో 115, కోనసీమ జిల్లాలో మరో వంద వరకూ ల్యాబ్‌లకు ప్రభుత్వ అనుమ తులున్నాయి. అనుమతులు లేనిల్యాబ్‌లు మరో అన్ని ఉంటాయి. దాదాపు అన్ని ల్యాబ్‌లలోనూ ధరల దందా కొనసాగుతూనే ఉంది. ఉదాహరణకు క్యాన్సర్ నిర్ధారణకు తప్పని సరిగా చేసే పెట్ స్కానింగ్‌కి రూ.25 వేల వరకూ వసూలు చేస్తున్నారు. ఇదే స్కానింగ్‌ని తక్కువ ధరకూ చేసే వీలుందని చెబుతున్నారు. ల్యాబ్‌లు ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోవడంతో పెద్ద ల్యాబ్‌లు ఎన్నో రకాల రాయితీలను ప్రకటిస్తున్నాయి. 10 శాతం నుంచి ఏకంగా 70 శాతం వరకూ రాయితీలను ప్రకటిస్తున్నాయంటే ఏ స్థాయిలో దోపిడీ జరుగు తుందో అర్థం చేసుకోవచ్చు. వైద్యులు వ్యాధి నిర్ధారణకు ల్యాబ్‌ల టెస్టులపైనే ఎందుకు పూర్తిగా ఆధారపడిపోతున్నారో అనే ప్రశ్నలకు సహేతుకమైన జవాబు శూన్యమే.



అధికారులకు మామూళ్లు..

ల్యాబ్‌లను నియంత్రించే అధికారం ఉన్న అధికారులు 'ఎందుకనో' తనిఖీల ఊసెత్తడం లేదు. సాధారణంగా ల్యాబ్‌లు ఐదేళ్లకు ఒకసారి లైసెన్సు రెన్యువల్ చేయించుకోవాలి. లైసెన్సు రెన్యువల్‌కి దరఖాస్తు సదరు అధికారి టేబు ల్‌పైకి వెళ్లినప్పుడు మాత్రమే తనిఖీ కాదు..పరిశీలన చేస్తున్నారు. అది కూడా తూతూ మంత్రంగానే జరుగుతోందనే ఆరోపణలు ఉన్నాయి.లైసెన్సు ఇచ్చిన తర్వాత ఐదేళ్ల పాటు ఆ ల్యాబ్ దరిదాపుల్లోకి అధికారులు వెళ్లకపోవడంతో చాలా ల్యాబ్‌లలో సదుపాయాలు,అవసరమైన యంత్ర పరికరాలు ఉండక పోయినా నడిపించేస్తున్నారు. అసలు ల్యాబ్‌లో అందుబాటులో లేని వైద్య పరీక్షలు బోర్డుల్లో దర్శనమిస్తుంటాయి. రోగి వెళ్లిన తర్వాత ఆ వైద్య పరీక్షలకు నమూనాను హైదరాబాద్, పుణె, ఢిల్లీ పంపిం చాలంటూ డబ్బులు వసూలు చేస్తున్నారు. కానీ చాలా మటుకు ఊళ్లోనే చక్కబెడుతున్నారు.

వరి తీర్చేనా!



- మరో 40 టన్నులు కొంటే సరి
- ధాన్యం రైతు గట్టెక్కినట్టే
- 3.4 లక్షల టన్నులు టార్గెట్
- 3.25 లక్షల టన్నులు కొనుగోలు
- ఆంధ్రజ్యోతి కథనంతో కదలిక

(రాజమహేంద్రవరం/కొవ్వూరు- ఆంధ్రజ్యోతి)

ఆరుగాలం పండించిన పంటను అమ్ముకోవడానికి అన్నదాత అవస్థలు పడుతున్నాడు. ఒక పక్క ప్రభుత్వం, మంత్రులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామంటూ ప్రకటనలు చేస్తున్నారు.అది క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. అధికార యంత్రాంగం గతం కంటే ఎక్కువే కొన్నాం.. టార్గెట్లు పూర్తయ్యాయంటూ కొనుగోళ్లను నిలుపుదల చేయడంతో రైతులు రోడ్డెక్కి ఆందోళన చేస్తున్నారు.జిల్లాలో మరో 40 వేల టన్నుల ధాన్యం సేకరిస్తే రబీ రైతాంగం గట్టెక్కుతుంది.అంతర్జాతీయ బియ్యం మార్కెట్ పడిపోవడంతో కాకినాడ పోర్టు నుంచి బియ్యం ఎగుమతులు లేకపోవడంతో జిల్లాలో మిల్లర్లు ధాన్యం కొను గోళ్లు ఆపేశారు. ఈ నేపథ్యంలో రైతాంగం అంతా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలవైపు చూసిన సంగతి తెలిసిందే.దీంతో ధాన్యం సేకరణ సమస్య మొదలైంది.జిల్లాలో సుమారు 4.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి కాగా మొదట్లో ప్రభుత్వం పౌరసరఫరాల సంస్థ ద్వారా 2.5 లక్షల టన్నుల ధాన్యం సేక రణ లక్ష్యంగా పెట్టుకుంది. మండలాలవారీ లక్ష్యాలు నిర్ణయించి కొనుగోలు చేసింది. కానీ మొదట్లోనే టార్గెట్లు పూర్తి కావడం, అప్పటికి ఇంకా కోతలు పూర్తి కాకపోవడంతో రైతుల ధాన్యం కొనేవాడు కరువయ్యారు.ఈ నేపథ్యంలో రైతుల ఇబ్బందులను పసిగట్టిన ఆంధ్ర జ్యోతి వారి పరిస్థితిని వెలుగులోకి తెచ్చింది. దీంతో జిల్లా యంత్రాంగం, మంత్రులు , ఎమ్మె ల్యేలు స్పందించారు. మరో 90 వేల టన్నుల లక్ష్యం పెంచడంతో రైతులు కుదుట పడ్డారు. అయితే ప్రస్తుతం మరో 40 వేల టన్నుల నుంచి 50 వేల టన్నుల ధాన్యం రైతుల వద్ద ఉండిపోయినట్టు చెబుతున్నారు. కొవ్వూరు డివిజన్‌లో ఎక్కువగా ఉంది. రాజమహేంద్ర వరం డివిజన్‌లో కేవలం అనపర్తి నియోజక వర్గంలో మాత్రమే కొంత మేర ఉన్నట్టు రైతు లు చెబుతున్నారు. బొండాల ధాన్యం కూడా ఉంది. గతంలో మిల్లర్లు ఎక్కువగా బొండాల రకం కేరళకు తోలేవారు. కానీ కేరళలో కూడా ప్రస్తుతం డిమాండ్ లేకపోవడంతో కొన్ని మిల్లులు తాత్కాలికంగా మూతపడడం గమ నార్హం. ప్రస్తుతం ప్రభుత్వం జిల్లాలో 20 వేల టన్నుల బొండాల ధాన్యం సీఎంఆర్ కింద సేకరించింది. మరో 20 వేల టన్నులు సేకరిస్తే మొత్తం సమస్య పరిష్కారమవుతుందని రైతులు,మిల్లర్లు చెబుతున్నారు. జిల్లాలో ఇప్పటి వరకూ 27,949 మంది రైతుల నుంచి 3,24,319.480 టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. దీని విలువ రూ. 746.62 కోట్లు. ఇంతవరకూ రైతుల ఖాతాల్లో రూ.603.62 కోట్లు జమచేశారు. మరో రూ.142.95 కోట్లు జమచేయడానికి సిద్ధం చేస్తున్నారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్ వచ్చేస్తుంది. జూన్ నెల నుంచే రైతాంగం ఏరువాకకు సిద్ధం కావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగం రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేస్తే, రైతులు సంతోషంతో ఖరీఫ్‌కు సన్నద్ధమవుతారు.

పంట వెళ్లినా..ఆన్‌లైన్ చేయలేదు..



ఆరుగాలం పండించిన పంటను అమ్ముకోవడానికి అవస్థలు పడుతున్నాం. చాగల్లు మండలంలో 100 ఎకరాలు వరిసాగు చేశా. అకాల వర్షాల కారణంగా 8 వేల సారలు మిల్లులకు తరలించి 20 రోజులవు తుంది. ఇంకా ఆన్‌లైన్ చేయలేదు. అధికారుల చుట్టూ తిరుగుతున్నాం. టార్గెట్ ఈ రోజు వస్తుంది. రేపు వస్తుంది అంటున్నారు.

- నామాల నరేంద్ర, రైతు,మల్లవరం

పంట కొనడం లేదు..



చాగల్లు మండలం మార్కొండపాడులో 18 ఎకరాలు సాగుచేశా. పంట అమ్మదామంటే ఆర్‌ఎస్‌కెలో టార్గెట్ అయిపోయిందని చెబుతున్నారు. వర్షాలు పడుతున్నందున మిల్లరు సహకారంతో ధాన్యాన్ని మిల్లుకు తరలించా. జేసీ,ఆర్డీవో కార్యాలయాల చుట్టూ తిరిగిన ప్రయోజనం లేదు. ప్రభుత్వం స్పందించి ధాన్యాన్ని కొనుగోలు చేయాలి.

- కె.సుబ్రహ్మణ్య రమేష్, మార్కొండపాడు

22 పంచాయతీలకు స్పెషల్ గ్రేడ్

అధికారుల ప్రతిపాదనలు

రాజమహేంద్రవరం రూరల్ మే 18 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల ఆదాయం, జనాభా ప్రాతిపదికన స్పెషల్ గ్రేడ్, గ్రేడ్-1, గ్రేడ్-2, గ్రేడ్-3 పంచాయతీలుగా మార్చనున్నారు. 10వేల పైబడి జనాభా కలిగి..రూ.కోటి వార్షికాదాయం చేకూరే పంచాయతీలను స్పెషల్ గ్రేడ్ పంచాయతీలుగా, 4 వేల నుంచి 10వేల మధ్య జనాబా కలిగి, రూ.50 లక్షల నుంచి రూ.కోటి మధ్య వార్షికాదాయం కలిగిన పంచాయతీలను గ్రేడ్-1 పంచాయతీలుగా, 2 వేల నుంచి 4 వేలు మధ్య జనాభా ఉన్న పంచాయతీలను గ్రేడ్-2 పంచాయతీలుగా, 2 వేల లోపు జనాభా కలిగిన గ్రామాలను గ్రేడ్-3 పంచాయతీలుగా మార్చనున్నారు. ఆయా పంచాయతీలకు గెజిటెడ్ స్థాయి అధికారి బాధ్యతలు అప్పగించనున్నారు. ఇటీవలే ఈవోపీఆర్డీలకు డిప్యూటీ ఎంపీడీవోలుగా పదోన్నతులు కల్పించారు. వీరికి ఈ బాధ్యతలు అప్పగించనున్నట్టు సమాచారం. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 63 పంచాయతీలకు స్పెషల్ గ్రేడ్ పంచాయతీలుగా మార్చుతూ ప్రతిపాదనలు పంపించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం, కొవ్వూరు డివిజన్ల పరిధిలో 22 పంచాయతీలను స్పెషల్ గ్రేడ్ పంచాయతీలుగా మారనున్నాయి. రాజమహేంద్రవరం డివిజన్‌లో 14 గ్రామాలు, అనపర్తి, బిక్కవోలు, గోకవరం, కడియం, కడియపులంక, బొమ్మూరు, ధవళేశ్వరం, హుకుంపేట, కాతేరు, పిడింగొయ్యి, శాటిలైట్‌సిటీ, కోలమూరు,దివాన్ చెరువు గ్రామాలు ఉన్నాయి. కొవ్వూరు డివిజన్ పరిధిలో 8 గ్రామాలు ఉన్నాయి. చాగల్లు,దేవరపల్లి, గోపాలపురం, పోతవరం, ఖండవల్లి,ఉండ్రాజవరం, వేలివెన్ను, పంగిడి గ్రామాలు ఉన్నాయి. రూరల్ మండలం పరిధి వెంకటనగరం, తొర్రేడు గ్రామాల్లో నిబద్ధతతో పన్నులు వసూలు చేస్తే ఎక్కువ మొత్తంలో ఆదాయం చేకూరుతుందని,స్పెషల్ గ్రేడ్ పంచాయతీలుగా మారే అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.



- పౌల్ట్రీ పరిశ్రమకు మళ్లీ నష్టాలు
- అప్పుడే ఎండ.. వెంటనే వాన
- తట్టుకోలేక చనిపోతున్న కోళ్లు
- పెరుగుతున్న మోర్టాలిటీ
- పడిపోయిన గుడ్ల దిగుమతులు
- లబోదిబోమంటున్న రైతాంగం



విభిన్న వాతావరణంతో విలవిల

అనపర్తి, మే 18 (ఆంధ్రజ్యోతి) : వాతావరణంలో వచ్చిన మార్పులు పౌల్ట్రీ రంగంపై పెనుమార్పులు చూపెడుతున్నాయి. ప్రస్తుతం పౌల్ట్రీ పరిశ్రమ నష్టాల్లో ఉంది. రెండు నెలల కిందట వచ్చిన బర్డ్‌ఫ్లూతో తీవ్ర నష్టాల్లో కూరుకుపోయారు. వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా మరింత నష్టాల పాలవుతున్నారు. ఎండల తీవ్రతకు కోళ్లు పిటల్లా రాలిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 1.50 కోట్ల కోళ్లు ఉండగా వీటి ద్వారా రోజుకు సుమారు 1 కోటి వరకు గుడ్లు దిగుమతి అవుతాయి. ఎండల తీవ్రతకు సుమారుగా 12 నుంచి 15 శాతం వరకు గుడ్లు దిగుమతి పడిపోగా రోజుకు సుమారుగా 30 వేల కోళ్ల వరకు భానుడి భగభగలకు నేల వాలుతున్నట్టు సమాచారం. ఈ ఏడాది వాతావరణంలో భిన్న పరిస్థితులు ఉన్నాయి. ఉదయం ఎండ మధ్యాహ్నం చిరు జల్లులు పడడంతో అధిక సంఖ్యలో కోళ్ల మృత్యువాత పడుతున్నాయని రైతులు చెబుతున్నారు. ఎండ తీవ్రత ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒకే విధంగా ఉంటే పెద్ద నష్టం జరిగేది కాదని విభిన్న వాతావరణం ఉండడంతో కోళ్లు తట్టుకోలేక పోతున్నాయని వారంటున్నారు. కోళ్లను ఎండ తీవ్రత నుంచి కాపాడుకునేందుకు ప్రతి షెడ్డుపైనా స్ప్రింకర్లు ఏర్పాటు చేశారు. షెడ్లపై నీళ్లు వెదజల్లుతూ వాతావరణ సమతుల్యత ఉండేలా చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే గుడ్లు ఉత్పత్తి తగ్గడం అనుకున్న రీతిలో ఎగుమతులు లేకపోవడంతో రైతులకు దినదిన గండంగా మారింది. రెండు రోజులు పేపర్ ధరకు కట్టుబడి జరగడం, మరో రెండు రోజులు కమింగ్ ధరతో సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని వాపోతున్నారు. ప్రస్తుతం గుడ్డు ధర రూ.5.15 పైసలు ఉన్నప్పటికీ కమింగ్ రేటుతో తక్కువ ధరకు ట్రేడర్లకు విక్రయించాల్సి వస్తుందని.. గుడ్డు దిగుబడి తగ్గిపోవడంతో మరింత నష్టం చవిచూడాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాణా రేట్లు మందుల రేట్లు, లేబర్ చార్జీలు, విద్యుత్ బిల్లులతో రైతులు సతమతమవుతున్నారని పలువురు పరిశ్రమ పెద్దలు అంటున్నారు.సీఎం నారా చంద్రబాబు నాయుడు పౌల్ట్రీ పరిశ్రమ ఎదుర్కొంటున్న కష్ట నష్టాలపై దృష్టి సారించాలని త్వరలోనే కోళ్ల రైతులకు కొన్ని రాయితీలు అందించి పరిశ్రమను ఆదుకుంటారన్న నమ్మకంతో ఉన్నామని పలువురు రైతులు అంటున్నారు. మరో నెల రోజుల పాటు విభిన్న వాతావరణం సాగితే మరింత నష్టం జరుగుతుందని రైతులంటున్నారు.

ఆలయ భూముల వేలం ఎప్పుడో!

వేణుగోపాలుడికి తొర్రేడులో 23.58 ఎకరాలు

రాజమహేంద్రవరం రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి) : దేవుడి భూములకు ఎసరు పెడుతున్నారు.. తక్కువ మొత్తంతో పాడుకునేలా చేసి దేవుడికే శఠగోపం పెట్టేలా చేస్తున్నారు.ఈ సంఘటనే అందుకు ఉదాహరణ. రాజమహేంద్రవరం రూరల్ మండలం తొర్రేడులో ఉన్న శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానం భూములకు గత నెల 25వ తేదీన జరగాల్సిన భూమి కౌలు హక్కు వేలం కొన్ని అనివార్య కారణాల వల్ల రద్దయింది. అయితే వేలం మళ్లీ ఎప్పుడు చేపడతారనేది ప్రశ్నార్థకంగా ఉంది. ఈ ఆలయానికి తొర్రేడులో 23.58 ఎకరాల భూమి ఉంది. దేవాదాయ శాఖ విధించిన నిబంధనల ప్రకారం వేలంలో పాల్గొనేవారు 5 లక్షల సాల్వెన్సీ సర్టిఫికెట్, రూ.20 వేలు దరావత్తు సొమ్ము చెల్లించాలి. సుమారు 15 మంది వరకూ వేలంలో పాల్గొనేందుకు సిద్ధం అయ్యారు. అయినా వేలం నిలుపుదల చేశారు. పాటదారులు వచ్చినా నిలుపుదల చేయడంపై రకరకాల విమర్శలు వినిపిస్తున్నాయి. గుట్టుచప్పుడు కాకుండా ఎంతో కొంత పెచ్చు ధర పెట్టి గతంలో పాడిన వారికే కట్టబెట్టే పనిలో అధికా రులు ఉన్నారంటూ ప్రచారం జరుగుతుంది. ఆరోగ్యం బాగాలేకపోవడంతో వేలం ప్రక్రియ నిలిపివేయాల్సి వచ్చిందని ఈవో సుబ్బారావు తెలిపారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్‌తో మాట్లాడి, ముందుగా గ్రామస్తులకు తెలియపరచి నిబంధనల ప్రకారం మళ్లీ వేలం నిర్వహిస్తామన్నారు.



నిడదవోలు, మే 18 (ఆంధ్రజ్యోతి) : దేశభక్తి ఉప్పొంగింది.. భారత్ మాతాకీ జై అంటూ జనం వీధుల్లోకి వచ్చారు.. మువ్వన్నెల జెండా పట్టుకుని వీధివీధినా మేలుకొలిపారు.. రండి మీరూ చేరండి అంటూ పిలవకనే పిలిచారు.. దీంతో నిడదవోలులో తిరంగా యాత్ర ఆదివారం ఘనంగా సాగింది.నిడదవోలు గాంధీబొమ్మ సెంటరు నుంచి వినాయకుడి గుడి మీదుగా ఐ లవ్ నిడదవోలు పార్కు వరకు తిరంగా ర్యాలీ నిర్వహించారు. దీనిలో భాగంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ భారత జాతి వైపు ఎవరైనా కన్నెత్తి చూస్తే వారికి గుణపాఠం చెప్పేందుకు సైనికుల నుంచి మొదలుకొని రైతుల వరకు జాతి యావత్తూ ఒక్కటై వారికి గుణపాఠం చెబుతుందనడానికి నిదర్శనమే ఈ తిరంగా యాత్ర అన్నారు. జనం స్వచ్ఛందంగా రావడం అభినందనీయమన్నారు. ర్యాలీ మన ఐక్యతకు నిదర్శనమన్నారు.స్కిల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బూరుగు పల్లి శేషారావు మాట్లాడుతూ మనమంతా ఒక్కటే అని.. ఏ సమస్య వచ్చినా ఒక్కటై ఎదుర్కొంటామనడానికి నిదర్శనం ఈ యాత్ర అన్నారు.ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, టీడీపీ, జనసేన, బీజేపీ, పార్టీల నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది వివిధ వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జవహర్‌కు అభినందనల వెల్లువ



జవహర్‌ను పుష్పగుచ్ఛాలతో అభినందిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

కొవ్వూరు, మే 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్‌గా నియమితులైన మాజీమంత్రి కేఎస్ జవహర్‌కు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. దీనిలో భాగంగా ఆదివారం ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు డి.దుర్గారావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు కొవ్వూరులోని ఆయన నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛాలు అందించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ ఏపీటీఎఫ్‌లో అలవడిన క్రమశిక్షణతో జవహర్ ఈ స్థాయికి చేరారన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పత్తి సువర్ణరాజు మాట్లాడుతూ ఏపీటీఎఫ్ సభ్యుడిగా, జిల్లా అధ్యక్షుడిగా ఆయన ప్రతి అడుగులో ఏపీటీఎఫ్ అండదండలు ఉంటాయన్నారు. అభినందించిన వారిలో రాష్ట్ర కార్యదర్శి సాల్మన్, రాష్ట్ర కౌన్సిలర్ షేక్ సలీం, జానీ, విష్ణు, వెంకటరావు, అనితాజ్యోతి, వెంకటలక్ష్మి, కరుణ, రాజశేఖర్, రాజు, సుభాకర్, గోపాలపురం, తణుకు, తాళ్లపూడి, కొవ్వూరు, చాగల్లు, నిడదవోలు, రాజమహేంద్రవరం, బిక్కవోలు, అనపర్తి, ప్రాంతాలకు చెందిన కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే జవహర్‌ను రాష్ట్ర చర్మకార వృత్తి సంఘం నేత నాగేశ్వరరావు ఆదివారం కొవ్వూరులో కలిసి వినతిపత్రం అందజేశారు.

శ్రీశైలం మల్లన్న సన్నిధిలో ఎమ్మెల్యే పూజలు



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే మద్దిపాటి , తదితరులు

గోపాలపురం, మే 18 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా శ్రీశైలం మల్లన్నస్వామిని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు స్వామివారి ఆశీస్సులు మెండుగా ఉండాలని కోరుకున్నట్టు చెప్పారు. అలాగే అభివృద్ధిని కాంక్షించి రేయింబవళ్లు పనిచేస్తున్న సీఎం చంద్రబాబుకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరామన్నారు. ఆయనవెంట టీడీపీ సీనియర్ నేత, గోపాలపురం ఏఎంసీ ఛైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజు, ద్వారకాతిరుమల మండల అధ్యక్షుడు సత్య నారాయణ, పసుమర్తి రతీశ్, పోలిన శ్రీను, తదితరులు ఉన్నారు.



పది అడుగుల తోటకూర మొక్క

● టీడీపీ మండల ఉపాధ్యక్షుడు వెంకట సుబ్బారావు ఇంటి పెరట్లో ...

నల్లజర్ల, మే 18 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా తోటకూర మొక్క అడుగు, మహా అయితే రెండు అడుగుల వరకు పెరు గుతుంది. కానీ నల్లజర్లలో టీడీపీ మండల ఉపాధ్యక్షుడు గుదె వెంకట సుబ్బారావు ఇంటి పెరటిలో మాత్రం ఏకంగా 10 అడుగులు వరకు ఏపుగా పెరిగింది. దీన్ని పలువురు చూసి ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. భూమి సారవంతం కావడం వల్లే మొక్క బాగా పెరిగి ఉంటుందని వ్యవసాయ అధికారి కమల్‌రాజ్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దేవరపల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని దుద్దుకూరులో సోమవారం ఉదయం విద్యుత్‌లైన్ల మరమ్మతు పనుల్లో భాగంగా ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మరలా మధ్యాహ్నం రెండుగంటల నుంచి సాయంత్రం 5.30 వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఏఈ ఎస్.నారాయణ అప్పారావు తెలిపారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి 'కూటమి' చర్యలు

● రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్



శింగవరంలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు, మే 18 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆదివారం శింగవరంలో రాష్ట్ర గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్యశాఖ ఆధ్వర్యంలో నిర్మించిన తాగునీటి ట్యాంకు పైపులైన్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జల జీవన్ మిషన్ పథకం కింద నీటి ట్యాంకు పైపలైన్ల నిర్మాణానికి రూ. 53.08 లక్షల అంచనాతో నిర్మించడం జరిగిందన్నారు. గ్రామం మొత్తం 720 ఇళ్లకు గాను 2348 మంది జనాభా నివసిస్తున్నారని, వీరి అవసరాలకు అనుగుణంగా మూడు ఓవర్ హెడ్ సర్వీసు రిజర్వాయర్ ట్యాంకులు మంజూరయ్యాయన్నారు. ఇందులో భాగంగా తొలుత 60 వేల లీటర్ల కెపాసిటీ కలిగిన ఓవర్‌హెడ్ సర్వీసు రిజర్వాయర్‌ను ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ బూరుగుపల్లి శేషారావు మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ప్రజారంజక పాలన సాగిస్తోందన్నారు. దానికి మనమంతా సహకరించాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కొయ్యే సూర్యారావు, జనసేన పార్టీ నాయకులు పెన్మత్స చందు, గ్రామపెద్దలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రేపు నియోజకవర్గ స్థాయి మహానాడు



కొవ్వూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని లిటరరీ క్లబ్ కల్యాణ మండపంలో మంగళవారం ఉదయం తొమ్మిది గంటలకు టీడీపీ నియోజకవర్గస్థాయి మహానాడు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఆదివారం పాత్రికేయులకు ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి పట్టణం, కొవ్వూరు, చాగల్లు, తాళ్లపూడి మండలాలకు చెందిన టీడీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు అధికసంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు.

వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



నల్లజర్ల శాఖా గ్రంథాలయంలో క్యారమ్స్ ఆడుతున్న విద్యార్థులు

నల్లజర్ల, మే 18 (ఆంధ్రజ్యోతి): వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని నల్లజర్ల శాఖా గ్రంథాలయ నిర్వాహకుడు రమణ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక శాఖా గ్రంధాలయంలో విద్యార్థులకు తెనాలి రామకృష్ణ నీతి కథలు, సుమతీ శతక పద్యాలు తెలియజేశారు. అనంతరం క్యారమ్స్ ప్రాక్టీస్ చేయించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ కె. దయశీల, విద్యార్థులు పాల్గొన్నారు.

17వ రోజుకు వేసవి శిక్షణ శిబిరం



శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

పెరవలి, మే 18 (ఆంధ్రజ్యోతి): తీపర్రు శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం ఆదివారంతో 17వ రోజుకు చేరుకుంది. ఇందులో రిసోర్సుపర్సన్ ఎండీ ప్రియాంక, పి.భార్గవి, ఎన్. పోసిబాబు పాల్గొని విద్యార్థులకు నీతికథలు చదివించడం, డ్రాయింగ్ పోటీలు వంటివి నిర్వహించారు. అనంతరం విజేతలను ఎంపిక చేశారు.

రోడ్ల పక్కన.. కోళ్ల వ్యర్థాలు

● ముక్కుమూసుకుంటున్న అటుగా వెళ్తున్న జనాలు



ముసుళ్లకుంట పరిధిలోని సర్వీస్ రోడ్డులో పడవేసిన వ్యర్థాలు

నల్లజర్ల, మే 18 (ఆంధ్రజ్యోతి): రోడ్ల పక్కనే కోళ్ల వ్యర్థాలను వేస్తుండడంతో ఆ ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతోంది. వివరాల్లోకి వెళితే.. ముసుళ్లకుంట పరిధిలోని హైవే సర్వీస్ రోడ్డు పక్కనకొంత మంది వ్యాపారులు కోళ్ల వ్యర్థాలను తెచ్చి పడవేస్తున్నారు. దీంతో ఈ మార్గంలో వెళ్లే ప్రయాణికులు, వాహనదారులు ముక్కుమూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. దీనిపై సర్పంచ్ నందమూరి శారద దేవిని వివరణ కోరగా, పంచాయతీ సిబ్బంది ద్వారా వాటిని తొలగిస్తామని, అలాగే గట్టి నిఘా ఏర్పాటు చేస్తామని చెప్పారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



1999-2000 సంవత్సరంలో పదోతరగతి చదువుకున్న విద్యార్థులు

తాళ్లపూడి, మే 18 (ఆంధ్రజ్యోతి): వేగేశ్వరపురం ఉన్నత పాఠశాలలో 1999-2000 సంవత్సరంలో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఒక్కచోట కలుసుకున్నారు. దీనిలో భాగంగా ఒకరికొకరు యోగక్షేమాలు తెలుసుకుని ఆనాటి మధురజ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈసందర్భంగా కరోనా కాలంలో అసువులు బాసిన మిత్రులకు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సత్యనారాయణ, కృష్ణ, లక్ష్మీపతి, సీతాదేవి, స్కూల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురం: గోపాలపురం జడ్పీ హైస్కూల్ 2001-02 సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఆర్గనైజింగ్ కార్యదర్శి స్థానిక రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ సునీత ఆధ్వర్యంలో విద్యార్థులందర్నీ ఒకే వేదికపైకి చేర్చి ఆనాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. అనంతరం ఆనాటి టీచర్లను ఘనంగా సత్కరించారు.



గోపాలపురంలో...

ప్రమాదకరంగా.. ఆర్ అండ్ బీ రోడ్డు



రాళ్లు తేలిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న నేతలు, పంచాయతీ అధికారులు (ఫైల్)

తాళ్లపూడి, మే 18 (ఆంధ్రజ్యోతి): తాళ్లపూడి - ప్రక్కిలంక గ్రామాల మధ్య ఆటోనగర్ వద్ద గల ఆర్‌అండ్‌బీరోడ్డు ప్రమాదభరితంగా మారింది. గతంలో ప్రక్కిలంక గ్రామం నుంచి తాళ్లపూడి వైపు గల డ్రైన్ పూడిపోవ డంతో అత్యవసర పరిస్థితులలో గుంతలపడ్డ రోడ్డును తాత్కాలికంగా రిపేరు చేశారు. ఆ ప్రాంతం రాళ్లు పైకి లేచి వాహనదారులకు పెను ప్రమాదంగా మారింది. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. సమస్య తెలుసుకున్న ప్రక్కిలంక నాయకులు, పంచాయతీ సిబ్బంది రోడ్డును పరిశీలించి సంబంధితఅధికారుల దృష్టికి తీసుకువెళతామన్నారు.

కొవ్వూరులో వర్షం



మెయిన్‌రోడ్‌లో కురుస్తున్న వర్షం

కొవ్వూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): పట్టణం, మండలంలో ఆదివారం వర్షం కురిసింది. ఉదయం నుంచి భానుడి ప్రతాపంతో తల్లడిల్లిపోయిన ప్రజలకు కాస్త ఉపశమనం కలిగింది. మధ్యాహ్నం రెండుగంటల సమయంలో ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమైంది.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

కొవ్వూరు, మే 18 (ఆంధ్రజ్యోతి) : అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె. శ్రీహరిరావు తెలిపారు. ధర్మవరంలోని ఓ కిరాణా దుకాణంలో అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్నారని సమాచారం రావడంతో రూరల్ పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో మద్యం విక్రయిస్తున్న కేతాడ గోపిని అరెస్టుచేసి అతని వద్ద నుంచి ఆరు క్వార్టర్ల మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు. ఇకనైనా నిత్యం దాడులు నిర్వహించాల్సి ఉంది.

ఘనంగా ముగిసిన పాశాలమ్మ జాతర



జాతరకు వచ్చిన భక్తులతో రద్దీగా మారిన రోడ్డు (ఇన్‌సెట్లో) పాశాలమ్మవారు

కొవ్వూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): ఆరికిరేవుల గ్రామదేవత పాశాలమ్మ వారి జాతర మహోత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. గ్రామ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీ నుంచి జాతర నిర్వహిస్తున్నారు. దీన్ని పురస్కరించుకుని గ్రామస్థులు ఆఖరిరోజుల మొక్కులు తీర్చుకుని, అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. గతవారం రోజులుగా గ్రామంలో గరగనృత్యాలు, బుట్టబొమ్మలతో అమ్మవారిని గ్రామపురవీధుల్లో ఊరేగించారు. ద్రాక్షారామ మేళం, తీపర్రు వారి బాణాసంచా, జగన్నాథపురం వారిచే కాళికాదేవి వేషధారణతో గుడి సేవ, పిప్పర మేళం, తీపర్రు బాణసంచా, బలిచేట ఊరేగింపు వంటి కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే ఈనెల 22వ తేదీన అమ్మవారిని పుట్టింటికి తీసుకురావడం జరుగుతుందని ఉత్సవకమిటీ సభ్యులు తెలిపారు. ఎటువంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పట్టణ సీఐ పి. విశ్వం ఆధ్వర్యంలో పట్టిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు.

కోటసత్తెమ్మకు విశేషపూజలు

● పలు జిల్లాల నుంచి పెద్దసంఖ్యలో భక్తుల రాక



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

నిడదవోలు, మే 18 (ఆంధ్రజ్యోతి): తిమ్మరాజుపాలెంలో వేంచేసిన కోటసత్తెమ్మ వారి దేవస్థానంలో ఆదివారం విశేషపూజలు నిర్వహించారు. అమ్మవారికి ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమై ధూపహారతి, నిత్యార్చన, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు జరిపారు. అనంతరం క్షీర, మహానివేదన గావించారు. దీనిలో భాగంగా ప్రత్యేక పూలతో అమ్మవారిని అలంకరించగా, భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆదివారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో పలు జిల్లాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ప్రత్యేకదర్శనం ద్వారా రూ.39,180, అన్నదాన విరాళాల ద్వారా రూ.10,547, ప్రసాద విక్రయాల ద్వారా రూ.29,730, పూజా టికెట్లు, ఇతర టికెట్ల ద్వారా రూ.60,970, విరాళాల ద్వారా రూ.22,116 మొత్తం రూ.1,62,543 ఆదాయం వచ్చినట్టు దేవస్థానం సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి వి. హరి సూర్యప్రకాష్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ అండ్ ఛైర్మన్ దేవులపల్లి రవిశంకర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ఉండ్రాజవరం, మే 18 (ఆంధ్రజ్యోతి): చివటం గ్రామపరిధి జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో ఒకరు మృతిచెందారు. కోనసీమ జిల్లా కపిలేశ్వరపురానికి చెందిన మట్టపర్తి ఆదియ్య (40) తాడేపల్లిగూడెం నుంచి తణుకు వైపు మోటారుసైకిల్‌పై వస్తుండగా స్థానిక కమ్మ కల్యాణమండపం ఎదురుగా జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో ఆదియ్య తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్ఐ జి. శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

గుళికలు మింగి వృద్ధురాలి ఆత్మహత్య

నిడదవోలు, మే 18 (ఆంధ్రజ్యోతి): మునిపల్లికి చెందిన వెలగన అమ్మాజీ (60) అనే వృద్ధురాలు గుళికలు మింగి ఆత్మహత్యకు పాల్పడింది. వివరాల్లోకి వెళితే... గత కొంతకాలంగా ఈమె అనారోగ్యంతో బాధపడుతోంది. దీంతో ఆ బాధను భరించ లేక పొలానికి వేసేందుకు తెచ్చిన గుళికలను ఆదివారం మింగేసినట్టు సమిశ్రగూడెం ఎస్ఐ వీరబాబు తెలిపారు. వైద్యసేవల నిమిత్తం నిడదవోలు ఆసుపత్రికి తరలించగా, అప్పటికే ఆమె మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని ఐదుగురికి గాయాలు

కొవ్వూరు, మే18(ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని ఐదుగురు గాయపడినట్టు పట్టణ హెడ్‌కానిస్టేబుల్ ఎం. సత్యనారాయణ తెలిపారు.జంగారెడ్డిగూడెంకు చెందిన మదంపాటి గణేష్‌కుమార్ ఈనెల 15వ తేదీన తన కుమార్తెలు ఇద్దరితో పాటు, బావమరిది పిల్లలు ఇద్దరిని మోటారుసైకిల్‌పై ఎక్కించుకుని రాజమహేంద్రవరం బయలుదేరాడు. ఈక్రమంలో గామన్‌బ్రిడ్జిపై గల 6వ స్తంభం వద్దకు వచ్చేసరికి ముందుగా వెళ్తున్న ఆర్టీసీ బస్సును క్రాస్ చేస్తుండగా, ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గణేష్‌కుమార్‌తో పాటు నలుగురు పిల్లలకు గాయాలయ్యాయి. దీంతో వారందరినీ రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం, గణేష్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు హెచ్‌సీ తెలిపారు.

నేటి నుంచి టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

బిక్కవోలు, మే 18(ఆంధ్రజ్యోతి):బిక్కవోలు ఉన్నత పాఠశాలలో సోమవారం నుంచి ఈనెల 28 వరకు పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు ఎంఈవో సీహెచ్ వీవీ సత్యనారాయణ ఆదివారం తెలిపారు.

గ్రంథాలయాధికారి నియామకమెప్పుడో?

● దేవరపల్లి శాఖా గ్రంథాలయాన్ని వేధిస్తున్న సిబ్బంది కొరత
● వెలవెలబోతున్న గ్రంథాలయం...
గణనీయంగా తగ్గుతున్న పాఠకుల సంఖ్య



దేవరపల్లి శాఖ గ్రంథాలయం

దేవరపల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయం పాఠకులు లేక పోవడంతో వెలవెలబోతోంది. అలాగే ఇప్పటి వరకు పూర్తిస్థాయి గ్రంథాలయాధికారిని నియమించలేదు. దీంతో ఈ ఏడాది వేసవి విజ్ఞాన శిబిరాన్ని ప్రారంభించలేదు. ఇక్కడ పనిచేసిన గ్రంథాలయాధికారి కేసిరెడ్డి వీరవెంకట ప్రసాద్ 2023 జూలైలో గుండెపోటుతో మరణించారు. అప్పటి నుంచి ఈ పోస్టు ఖాళీగానే ఉంది. యర్నగూడెం శాఖ గ్రంథాలయాధికారి అనిత ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఆమె రెండు రోజులకు ఒకసారి వచ్చి వెళ్తున్నారు. దీంతో స్వీపర్ కుమారే గ్రంథాలయాన్ని నడుపుతున్నారు. పాఠకులకు న్యూస్‌పేపర్లు తప్ప.. మరే ఇతర పుస్తకాలైనా కావాలంటే గదికి తాళం వేసి ఉంటుంది. గ్రంథాలయ ఇన్‌చార్జి వస్తేనే ఈ పుస్తకాలు ఇవ్వడం జరుగుతుంది. గతంలో నిత్యం 60,70 మంది పాఠకులు గ్రంథాలయానికి వచ్చేవారు. ప్రస్తుతం వారి సంఖ్య గణనీయంగా తగ్గింది. ఇప్పటికైనా రెగ్యులర్ అధికారిని నియమించాలని పాఠకులు అధికారులు, ప్రజాప్రతినిధులను కోరుతున్నారు.

చాగల్లులో కోలాట భజనల్లో శిక్షణ

● సంతోషం వ్యక్తం చేస్తున్న చిన్నారుల తల్లిదండ్రులు



కోలాట భజన నేర్చుకుంటున్న చిన్నారులు

చాగల్లు, మే 18 (ఆంధ్రజ్యోతి): మనం దేవాలయాల వద్ద పండుగలు, జాతరలు, ఇతర వేడుకల సమయంలో కోలాట భజనలు తిలకిస్తుంటాము. ప్రస్తుతం డీటీఎస్ సౌండ్ సిస్టమ్‌తో పాటు డ్యాన్స్ బేబీ డ్యాన్స్, మ్యూజికల్ నైట్ వంటి వెస్ట్రన్ సంస్కృతి పెరిగిపోవడంతో కోలాట భజనలు, తాళాల భజనలకు ఆదరణ తగ్గింది. అయితే మండల కేంద్రమైన చాగల్లులో మాత్రం ఇప్పటికీ పలు వేడుకల్లో కోలాటాలు నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. స్థానిక వేణుగోపాలస్వామి వారి గుడి వద్ద వేసవి సెలవుల సందర్భంగా చిన్నారులకు కోలాట భజనలో శిక్షణను గతనెల రోజులుగా ఇస్తున్నారు. సెల్‌ఫోన్ వంటి వాటికి దూరంగా ఉంటూ ఆధ్యాత్మిక, దైవచింతనతో కూడిన కోలాట భజనల వల్ల మంచి వ్యాయామం కూడా లభిస్తుంది. ప్రతి రోజూ సాయంకాలం సుమారు రెండు గంటల పాటు శిక్షణ ఇస్తున్నారు. పిల్లలు వేసవి సెలవుల్లో కోలాట భజనల్లో శిక్షణ పొందడంపై పలువురు తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తూ, నిర్వాహకులను అభినందిస్తున్నారు.



శిక్షణ పొందుతున్న దృశ్యం